ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 5 ఆగస్టు 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0


పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలో కలుస్తున్న వరద జలాలు

పోలవరం వద్ద స్వల్పంగా పెరిగిన గోదావరి

- పట్టిసీమ శివక్షేత్రానికి, పురుషోత్తపట్నానికి లాంచీల రాకపోకల పునరుద్ధరణ

పోలవరం, ఆగస్టు 4 : పోలవరం ప్రాజెక్టు వద్ద మూడు రోజులుగా తగ్గుముఖం పట్టిన గోదావరి నీటిమట్టం ఆదివారం స్వల్పంగా పెరిగింది. భద్రాచలం వద్ద 37.30 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదులు, కొండవాగుల జలాలతో గోదావరి నీటిమట్టం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 7,00,695 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ఎల్‌ఎన్ డీపేట కొవ్వాడ రిజర్వాయర్‌లో నీటిమట్టం 89.40 మీటర్లు నమోదు కాగా 120 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు సిబ్బంది సత్యనారాయణ తెలిపారు. కొవ్వాడ రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన వరద జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. పట్టిసీమ శివక్షేత్రానికి, పోలవరం నుంచి పురుషోత్తపట్నానికి లాంచీల రాకపోకలు పునరుద్ధరించారు.

జిల్లాలో తొమ్మిది మంది ఎస్‌ఐల బదిలీ

ఏలూరు క్రైం, ఆగస్టు 4 : జిల్లాలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. భీమడోలులో పనిచేస్తున్న ఎస్‌ఐను తిరిగి అక్కడే నియమించారు. లక్కవరం ఎస్‌ఐ తోటకూర సుధీర్‌ను ద్వారకా తిరుమల ఎస్‌ఐగా, అక్కడ పనిచేస్తున్న గుడివాడ సతీష్‌ను ఏలూరు వీఆర్‌కు బదిలీ చేశారు. తడికలపూడి ఎస్‌ఐ ఎం.జయబాబును టి.నరసాపురం ఎస్‌ఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ డీడీ మహేశ్వరరావును ఏలూరు వీఆర్‌లో ఉంచారు. చింతల పూడి ఎస్‌ఐ ఎం.కుటుంబరావును తిరిగి అక్కడే నియమించారు. జీలుగుమిల్లి ఎస్‌ఐ వి.చంద్రశేఖర్‌ను కొయ్యలగూడెం ఎస్‌ఐగా నియమించారు. కొయ్యలగూడెం ఎస్‌ఐగా పనిచేస్తున్న జీజే విష్ణువర్ధన్‌ను ఏలూరు వీఆర్‌లో ఉంచారు. నిడమర్రు ఎస్‌ఐ ఆర్.శ్రీనును ఏలూరు వీఆర్‌లో ఉంచారు.

వైకల్యం లేకపోయినా..
దివ్యాంగ పింఛన్!

- పింఛన్ల కోసం అడ్డదారులు తొక్కిన అనర్హులు
- గత వైసీపీ పాలనలో మూడు రెట్లు పెరిగిన దివ్యాంగ పింఛన్లు
- ఇటీవల గ్రామ సభల్లో అనర్హుల గుర్తింపు
- కూటమి ప్రభుత్వం దృష్టి సారించి అర్హులకు న్యాయం చేయాలంటూ దివ్యాంగుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి




ఏలూరు రూరల్, ఆగస్టు 4 : గ్రామాల్లో ఒకప్పుడు దివ్యాంగ పింఛన్ తీసుకోవాలంటే నామోషీగా ఫీలయ్యేవారు. కాని కొంతకాలంగా పరిస్థితి పూర్తిగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో నియమ నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా పింఛన్లు మంజూరు చేశారు. కొందరు అనర్హులు పింఛన్ల కోసం అడ్డదారులు తొక్కి అర్హులుగా పింఛన్ పొందుతున్నారు. ప్రస్తుతం దివ్యాంగుల కోటా, వితంతు, చేనేత కోటాలో పింఛన్లు తీసుకుంటున్న వారిని చూసి జనం ముక్కున వేలేసుకుంటున్న పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. ఏలూరు రూరల్ మండలంలో ఓ వ్యక్తి చేనేత కార్మికుడిగా, మరో వ్యక్తి దివ్యాంగుడిగా, మరో యువతికి భర్త ఉన్నప్పటికీ వితంతు పింఛన్ పొందుతోంది. మరో పంచాయతీలో ఓ పెద్దమనిషి ఒడ్డు, పొడుగు బాగానే ఉన్నప్పటికి దివ్యాంగ పింఛన్ పొందుతున్నాడు. ఇటీవల జరిగిన ఉపాధి హామీ గ్రామసభల్లో ఈ ఘటనలు వెలుగు చూశాయి. పలు గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు కంటే దివ్యాంగుల పింఛన్‌దారులు ఎక్కువ అవ్వడం అధికారులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఏలూరు రూరల్ మండలంలో వృద్ధులు, వితంతు పింఛన్ల తర్వాత స్థానంలో దివ్యాంగులే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలన కాలంలో దివ్యాంగ పింఛన్లు ఏకంగా మూడురెట్లు పెరిగాయి. ఇదే సమయంలో ఇతర పింఛన్లు ఆ స్థాయిలో పెరగకపోవడం గమనార్హం. వైకల్యం లేకపోయినా అక్రమ మార్గంలో సదరన్ సర్టిఫికెట్లు సంపాదించి అర్హులుగా దివ్యాంగ పింఛన్ పొందుతున్నట్టు ఆరోపణలున్నాయి. పంచాయతీల్లోనే ఎక్కువ శాతం దివ్యాంగ పింఛన్లు ఉన్నాయంటే అడ్డగోలు సర్టిఫికెట్ల దందా ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్‌లను పొందుతున్న అనర్హులను గుర్తించి ఏరివేత కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాలని, దీనివల్ల అర్హులకు న్యాయం జరుగుతుందని దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హులకు పింఛన్ మంజూరులో ఆంక్షలు లేకుండా వారి ఇంట్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా పింఛన్ ఇవ్వాలని, కోరుతున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 4: జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కుక్కునూరు మండలంలో 11.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 2.2 మి.మీ నమోదైంది. వేలేరుపాడులో 11, పోలవరంలో 9.8, జంగారెడ్డిగూడెంలో 6.8, జీలుగుమిల్లిలో 6.8, చింతలపూడిలో 6.2, బుట్టాయగూడెంలో 5, కామవరపుకోటలో 2.6, టి.నరసాపురంలో 2 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఏం చేయాలి ఎలా చేయాలి!



కలెక్టర్, ఎస్పీలతో నేడు సీఎం చంద్రబాబు భేటీ

భూ అక్రమణలు.. ఎక్కడికక్కడ నిలిచిన గృహ నిర్మాణం.. పంచాయతీ రాజ్‌లో పడకేసిన పనులు.. ఎడాపెడా అక్రమ కేసులు.. వైసీపీ నేతల దురాక్రమణలు.. అసైన్డ్ భూముల్లో అక్రమాలు, రిజిస్ట్రేషన్లు.. ఇలా ఒకటేంటి పాలనలో కొత్తదనం నింపేలా ప్రతీ అంశంపైనా సోమవారం కలెక్టర్లు, ఎస్పీలతో జరిగే భేటీలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించనున్నారు.



- కీలక విభాగాలపై ఆరా తీయనున్న సీఎం
- వివిధ శాఖల తీరుపై దిశా నిర్దేశం
- ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లను తేల్చబోతున్నారు
- శాంతిభద్రతలు అమలు పైనా ప్రత్యేక దృష్టి



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఏలూరు జిల్లా వ్యాప్తంగా గడిచిన ఐదేళ్లల్లో పాలన పూర్తిగా పడకేసింది. సంక్షేమ పథకాలు అనేకం మూలనపడ్డాయి. భూ ఆక్రమణలకు కొదువేలేదు. అన్నిటికంటే మించి అక్రమ రిజిస్ట్రేషన్లు శరవేగంగా సాగాయి. ఇసుక, మట్టి ఇలా ఏది దొరికితే అది అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కొందరు తన్నుకుపోయారు. కీలకమైన రక్షిత నీటి పథకాలు ప్రారంభం కాలేదు. ఎక్కడికక్కడ రోడ్లు గుంతలు తేలి జనం ప్రాణాలు తీశాయి. కీలక రంగాలైన రెవెన్యూ, పోలీస్‌లోను కొందరు అప్పటి వైసీపీకి పూర్తిగా కొమ్ముకాశారు. ఇప్పటికే ఈ తరహా సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నివేదికలను రాబట్టింది. మరికొన్ని శాఖలకు సంబంధించి ఇంకా నివేదికలు అసంపూర్ణంగా ఉన్నా అందుబాటులో ఉన్న సమాచారంతోనే రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, తీసుకోబోయే నిర్ణయాలు, కీలక వ్యవహారాల్లో వేగం వంటి వాటిని సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు దిశ, నిర్దేశం చేయబోతున్నారు. ఈ కీలక సమావేశానికి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిషోర్‌లు హాజరవుతున్నారు. ఇప్పటికే తమ శాఖలకు సంబంధించి కీలక నివేదికలను సరిపోల్చుకునే క్రమంలో బిజీగా ఉన్నారు.

కూటమి ప్రభుత్వం కొలువుతీరి వంద రోజులు కూడా పూర్తికాకమునుపే పాలనలో శరవేగంగా మార్పులు, చేర్పులు చేస్తుంది. ఇప్పటికే పై నుంచి కింది స్థాయి వరకు అధికారులను స్థానచలనం చేశారు. పాలనలో తమదైన మార్కు ఉండేలా, ప్రజలకు చేరువయ్యేలా వరుసగా ఒక్కొక్కటి గాడిన పెడుతున్నారు. ఈక్రమంలో క్షేత్రస్థాయిలో యంత్రాంగం కదిలేలా చేయాలనేదే ప్రభుత్వ నిర్ణయంగా కనిపిస్తోంది. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీలతో కీలక భేటీని నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా సీఎంతో జరిగే ఈ తరహా భేటీల్లో కొన్ని ప్రాధాన్యత అంశాలు మాత్రమే ఇంతకుముందు చర్చించేవారు. కాని గడిచిన ఐదేళ్లల్లో జరిగిన వ్యవస్థలపై దాడి, కుప్పకూలిన భిన్న వ్యవస్థలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యత అంశాలు, ఇతర అంశాల్లో ఎలా నడవడిక ఉండాలి, గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను ఎత్తిచూపుతూనే వాటిని సవరించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపైనా నిర్దేశం చేయబోతున్నారు. వాస్తవానికి జిల్లాల వ్యాప్తంగా గ్రీవెన్స్‌లో వస్తున్న ఫిర్యాదులే కాకుండా ముఖ్యమంత్రి దగ్గర నుంచి స్థానిక ప్రజాప్రతినిధుల వరకు ఈ తరహా ఆక్రమణలు, భూదందాలు, బెదిరింపులపైన పెద్ద సంఖ్యలో విజ్ఞాపనలు అందించడంతో ఆ మేరకు కూడా ఏఏ నిర్ణయాలు తీసుకోవాలో కూడా కీలకంగా ఎస్పీలకు సంకేతాలు ఇవ్వబోతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వందలాది అసైన్డ్ భూములు వైసీపీ నేతలు చెరపట్టారు. ఫ్రీ హోల్డ్ పేరిట రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమ రిజిస్ట్రేషన్లకు అనేక మంది తెగబడ్డారు. ఈ విషయాల్లో చాలా వరకు సొమ్ములు చేతులు మారాయి. ఎగువ నుంచి దిగువ వరకు యంత్రాంగంలో కొందరు అప్పట్లో లాలూచీ పడడం, మీకింత.. మాకింత చొప్పున లావాదేవీలకు దిగడం, ఆ మేరకు కొన్ని బెదిరింపులు, ఒత్తిళ్ళకు తలొగ్గి మరికొన్నింటిని అలవోకగా తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. వీటన్నింటిపైనా కలెక్టర్ల సమావేశంలో కీలకంగా చర్చించబోతున్నారు. ఇప్పటికే అన్న క్యాంటీన్లు ఈనెల 15న ఆరంభించనున్న క్రమంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపైన కలెక్టర్లకు మార్గదర్శకం చేయబోతున్నారు.

శాంతిభద్రతల పైనా దృష్టి..

శాంతిభద్రతలపై ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబోతోంది. దీనికి తగ్గట్టుగానే ఇప్పటివరకు జిల్లాల వారీగా వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా నమోదు చేసిన అక్రమ కేసులు, పర్యావసానాల పైనా సమీక్ష జరిగే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలు ఎలా అమలవుతున్నాయి, ఎవరెవరు ఎక్కువ జోక్యం చేసుకుంటున్నారు, కింది స్థాయిలో పరిస్థితి ఏ రూపంలో సాగుతుందనే విషయంపైనా కలెక్టర్, ఎస్పీతో ప్రత్యేకించి జరిగే భేటీలో సీఎం చంద్రబాబు ఆరా తీయబోతున్నారు. గోదావరి జిల్లాల్లో పైకి తెలియకుండానే లోలోన కేసులు బనాయించారు. వాటిలో అత్యధికం టీడీపీ నాయకులు, కార్యకర్తలపైనే ఉన్నాయి. ఒక నివేదిక ప్రకారం దాదాపు 256 అక్రమ కేసులు, మరో పది మందిపై హత్యాయత్నం కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఇవి కాకుండా అక్రమ మట్టి, ఇసుక రవాణాలోను అడ్డుకున్నందు ఇంకొందరిపైనా ఇదే రకమైన కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిపైనా చర్చించే అవకాశాలు లేకపోలేదు.

కీలక శాఖల పైనా సీరియస్ సమీక్ష ..



పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మునిసిపల్, కార్పొరేషన్లు, రెవెన్యూ, ఎక్సైజ్, విద్య, వైద్యం వంటి శాఖలన్నింటిపైనా సమగ్రంగా సీఎం సమీక్షించబోతున్నారు. జిల్లాల వారీగా వైసీపీ హయాంలో అనేక ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసినా వాటికి తగినన్ని నిర్దేతుకమైన నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వైద్య, ఆరోగ్యశాఖలో తగినన్ని పోస్టులను భర్తీ చేసినా రకరకాల ప్రయోగాలతో కొంత అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతకు ముందు పీహెచ్‌సీ పరిధిలో వైద్య అవసరాలు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలపైనే సమీక్షించేవారు. కాని గత ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లు ఆరంభించి డాక్టర్లను నియమించలేదు. వైద్య విధాన పరిషత్, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో వైద్యులు, సిబ్బంది కొరత విస్తృతంగా ఉంది. ఎక్సైజ్ శాఖలో ఇప్పటికే అంతా ప్రభుత్వపరంగా జరిగిందని చెబుతున్నా.. లోలోన జరిగిన దందాలపైనా ఇప్పుడు దృష్టి పెట్టారు. దీనిపై కూడా చర్చించాలని భావిస్తున్నారు. మునిసిపల్, కార్పొరేషన్లలో ఎక్కడికక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహారం సాగింది. పారిశుధ్యం లోపించి పట్టణ ప్రాంతాల్లోను భారీగా వ్యాధులు ప్రబలేందుకు కారణమైంది. అత్యంత కీలకమైన పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్‌లలోను పరిస్థితి అంతంత మాత్రంగానే మారింది. గతంలో ప్రతిపాదించిన మంచినీటి ట్యాంకులు, పైపులైన్లను గత ఐదేళ్లల్లో ఎక్కడా మచ్చుకైనా ఆరంభించలేదు, ఆ దిశగా కనీసం కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు కేంద్రం సహాయంతో జలరక్ష అమలు చేయబోతున్నారు కాబట్టి మూలన పథకాలన్నింటికీ జీవం పోసేలా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకపోలేదు. త్వరలో ఆరంభం కాబోయే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఈ మధ్యనే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు దరిమిలా తదుపరి తీసుకోవాల్సిన చర్యలన్నింటి పైనా నిర్దేశం చేసే అవకాశం ఉంది.

ఇంటింటా.. సోలార్ వెలుగులు



- సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహం
- రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్
- ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనతో నిరంతర సౌరకాంతులు
- మిగులు ఉత్పత్తితో వినియోగదారునికి అదనపు ఆదాయం
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్ష కనెక్షన్లు చేయాలని లక్ష్యం
- గృహ విద్యుత్ వినియోగదారులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరం
- ఇంతవరకు వచ్చిన దరఖాస్తులు 487.. కనెక్షన్లు ఇచ్చినవి 104

ఏలూరు సిటీ, ఆగస్టు 4 : ఇంటింటా సోలార్ వెలుగులు ప్రజ్వరిల్లనున్నాయి. నిరంతరాయంగా విద్యుత్ కాంతులు వెదజల్లడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనకు శ్రీకారం చుట్టింది. భవనం పై భాగంలో సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకుని సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించుకోవటంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించి విక్రయించుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఈ సోలార్ విద్యుత్ వినియోగంలో నిరంతర విద్యుత్‌తో పాటు విద్యుత్ అంతరాయాలు, లోటల్టేజి, విద్యుత్ బిల్లుల సమస్యలకు చెక్ పెట్టేలా ఈ పథకాన్ని రూపొందించారు. పెట్టుబడి సులభంగా తిరిగి రావడంతో పాటు రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ అందించడంతో ఈ పథకానికి అనూహ్య స్పందన వస్తోందని చెబుతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా వినియోగదారులు ఈ ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, రైల్వేగేట్లు, డివైడర్లు, అపార్ట్‌మెంట్లు వద్ద సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్ష సోలార్ కనెక్షన్లు ఇవ్వాలని ఏపీఈపీడీసీఎల్ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ప్యానెల్స్.. నెట్ మీటర్ ఏర్పాటు

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తారు. భవనం పైభాగంలో వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానెల్‌ను అమర్చుతారు. ప్రస్తుతం వినియోగించే విద్యుత్ మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేసి దీనిద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగాన్ని లెక్కిస్తారు. విద్యుత్ వినియోగానికి మించి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్‌ను అనుసంధానం చేస్తారు. ఆ విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. వినియోగదారులు ఉత్పత్తి చేసే అదనపు విద్యుత్‌కు ఆదాయాన్ని విద్యుత్ శాఖ సమకూర్చుతుంది. సబ్సిడీ, బ్యాంకు రుణంతో పాటు పెట్టుబడి 6, 7 సంవత్సరాల్లో తిరిగి వచ్చే అవకాశాలున్నా యి. సూర్యఘర్ ప్యానెల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగ దారుల ఖాతాల్లో సబ్సిడీ



జమ చేస్తారు. ముందుగా వినియోగదారులు తమ బ్యాంక్ ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలోవాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ విద్యుత్ ఉత్పత్తికి 3 నుంచి 4 ప్యానెల్స్ ఉపయోగిస్తారు.

ఈ పథకాన్ని పొందడం ఎలా..

ఈ పథకాన్ని పొందాలంటే గృహ విద్యుత్ వినియోగదారులు తమ వినియోగం 300 యూనిట్లు లోపు ఉండాలి. ఈ పథకం కోసం మొబైల్‌లో సూర్యఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగదారుని వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల విద్యుత్ బిల్లులు కాపీలను జతచేసి ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ రుసుం కిలోవాట్ ఆధారంగా చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి. కిలోవాట్స్‌ను బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు. మిగిలిన సొమ్ము మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. వినియోగ దారులు వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1912 ను సంప్రదించవచ్చు.

487 మంది రిజిస్ట్రేషన్..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం 487 మంది వినియోగదారులు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. భీమవరం విద్యుత్ డివిజన్‌లో 72, ఏలూరు విద్యుత్ డివిజన్‌లో 118, జంగారెడ్డిగూడెంలో 25, నరసాపురం విద్యుత్ డివిజన్‌లో 79, నిడదవోలు విద్యుత్ డివిజన్‌లో 92, తాడేపల్లిగూడెం విద్యుత్ డివిజన్‌లో 101 మంది వినియోగదారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జిల్లా మొత్తం మీద 1,582 కిలోవాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ జరిగింది. 284 మంది వినియోగదారులకు సంబంధించి 858.6 కిలోవాట్ల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు ఇన్‌స్టలేషన్ జరిగింది. ఇప్పటివరకు 355.97 కిలోవాట్లకు సంబంధించి 104 మంది వినియోగ దారులకు ఈ పథకంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు.
- పి.సాల్మన్ రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, ఏలూరు

రూ.44 లక్షల
నకిలీ కరెన్సీ పట్టివేత

ఇద్దరి అరెస్టు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్.. స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ

ఏలూరు క్రైం, ఆగస్టు 4 : నకిలీ కరెన్సీని చలామణి చేయడానికి ప్రయత్నించిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను తెలిపారు. ఏలూరులోని 108 అంబులెన్సులో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న దొండపాటి ఫణికుమార్ అనే వ్యక్తికి గత నెల 28వ తేదీన 84669 50693 నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడాడు. తమ వద్ద రూ.44 లక్షల విలువైన రూ.500 కొత్తనోట్లు ఉన్నాయని ఆ సొమ్మును తాము మార్కెట్‌లోకి ప్రవేశపెట్టలేమని, మీరు రూ.10 లక్షల కరెన్సీ ఇస్తే ఆ కొత్తనోట్లను ఇచ్చేస్తామని ఆశ చూపించాడు. అడ్వాన్సుగా జూలై 30వ తేదీన రూ.మూడు లక్షలు ఇచ్చాడు. ఇదే విషయాన్ని తన స్నేహితులకు ఫణికుమార్ చెప్పాడు. ఇదంతా మోస మని తక్షణ మే పోలీసులకు ఫిర్యాదు చేద్దామ ని ఈనెల 3న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం ఎస్పీకి తెలుపగా ఆయన ఆదేశాల మేరకు ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు మల్లేశ్వరరావు, లక్ష్మణకుమార్, త్రీటౌన్ సీఐ కె.శ్రీనివాసరావు, సిబ్బంది కలిసి ప్రణాళిక సిద్ధం చేశారు. మిగిలిన సొమ్ము ఇస్తామని ఫణికుమార్ ఫోన్ చేసి వారికి చెప్పాడు. దీంతో ఏలూరు కొత్త బస్టాండ్ వెనుక రైలు పట్టాలు దగ్గరకు రమ్మని సూచించారు. చింతలపూడి మండలం మల్లాయిగూడేనికి చెందిన మారు మూడి మధుసూదనరావు, జంపలవారిగూడెంకి చెందిన కారు డ్రైవర్ బీరెల్లి రాంబాబు రూ.44 లక్షల నకిలీ కరెన్సీ బ్యాగ్‌లో పెట్టుకుని వచ్చా రు. అప్పటికే అక్కడ నిఘా ఉన్న పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు ఎస్పీ చెప్పారు. ఈ నగదు వీరికి ఎలా వచ్చింది..? ఎవరు ప్రింటింగ్ చేశారు..? ఈ నకిలీ కరెన్సీలో ఎవరెవరి పాత్ర ఉందనే దానిపై దర్యాప్తు చేపడుతున్నామని స్పష్టం చేశారు. కేసులో నేరస్తులను సకాలంలో అరెస్టు చేసి నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్న అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందించారు. సమావేశంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ జి.స్వరూపరాణి, సీసీఎస్ సీఐ సీహెచ్‌వీ మురళీకృష్ణ, త్రీటౌన్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సక్సెస్

7

‘ఆంధ్రజ్యోతి’ కథనంతో కదిలిన దాతలు, ప్రభుత్వం

మెసేజ్‌లకు స్పందించవద్దు

ఎస్పీ కిశోర్



ఏలూరు క్రైం, ఆగస్టు 4 : మీడియా మాధ్యమాల ద్వారా, ఫోన్‌కాల్స్ ద్వారా, మెసేజ్‌ల ద్వారా వచ్చే వాటికి స్పందించ వద్దని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ప్రజలకు సూచించారు. సైబర్ నేరగాళ్ళు లాటరీ తగిలిందనో, లక్కీడిప్ ద్వారా మీరు ఎంపికయ్యారనో లేదా మీకు కొరియర్ వచ్చిందనో రకరకాల ఫోన్‌కాల్స్ కాని, మెసేజ్‌లు కాని పంపిస్తున్నారని చెప్పారు. ఇలాంటి వాటిని నమ్మి ఆశపడితే చివరకు మోసపోవడమే జరుగుతుందన్నారు. డబ్బులు ఊరికే రావని అదే విధంగా ఊరికే ఎవ్వరు ఇవ్వరని అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓటీపీ నెంబర్ కాని, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే స్పందించవద్దన్నారు. కొంతమంది వాట్సప్ కాల్స్ చేసి బెదిరిస్తున్నారని తాము సీబీఐ అధికారులమనో, పోలీస్ అధికారులమనో చెప్పి, కొరియర్‌లో డ్రగ్స్ బుక్ చేశారంటూ కేసు నమోదు చేశామని బెదిరిస్తారన్నారు. మరికొంత మంది ఫోన్లను హ్యాక్ చేయడానికి ఏపీకే ఫైల్స్‌ను పంపించి వాటిని ఓపెన్ చేయగానే మన ఫోన్ డేటా సైబర్ నేరగాళ్ళ చేతిలోకి వెళ్ళిపోతోందన్నారు. హ్యాక్ చేసిన తరువాత మన ఫోన్ డేలాలో ఉన్న ఫోటోలను మార్ఫింగ్ చేసి వీడియో కాల్స్ ద్వారా చూపించి బెదిరిస్తారని ఇలాంటి వాటికి భయపడవద్దని వెంటనే జిల్లా పోలీస్ కార్యాలయ వాట్సప్ నెంబర్ 95503 51100కు మెస్సేజ్ రూపంలో తెలియజేయాలని ఎస్పీ కిశోర్ సూచించారు.

రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలు

- పట్టించుకోని అధికారులు
- పుట్ట గొడుగుల్లా ప్రైవేటు రిసార్ట్స్ నిర్మాణం
- పంచాయతీల నుంచి యథేచ్ఛగా అనుమతులు



రిసార్ట్స్ వెళ్ళేందుకు సీఆర్‌జడ్ భూముల్లో వేసిన రోడ్డు

మొగల్తూరు, జూలై 30 : జిల్లాలోనే పేరుగాంచిన ఏకైక సాగర తీరం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతోంది. మొగల్తూరు మండలంలో కేపీ పాలెం, పేరుపాలెం సౌత్ పంచాయతీల పరిధిలో సుమారు తొమ్మిది కిలోమీటర్ల తీరం విస్తరించి ఉంది. సాగర తీరంలో వేళ్లంకిణ్ణి మాత ఆలయం నిర్మాణం తరువాత మొగల్తూరు మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం సాగర తీరాలకు పర్యాటక కేంద్రంగా గుర్తింపు లభించింది. ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం, చల్లటి గాలి, సముద్ర అలల కనువిందు చేస్తుండడంతో ఈ తీరం పర్యాటకులను ఎంతోగానో ఆకట్టుకుంటుంది. ఏటా కార్తిక మాసంలో వన సమారాధన పేరుతో జిల్లా నుంచే గాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది సందర్శకులు, పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లోనూ తీరం వద్ద పర్యాటకుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఇదే అవకాశాన్ని గుర్తించిన పలువురు స్థానికులు పేరుపాలెం సౌత్ పరిధిలో వారికి గల తోటల్లో ప్రయివేట్ రిసార్ట్స్ నిర్మిస్తున్నారు. ఈ రిసార్ట్స్ రూమ్‌లో ఉండే అందాలను సందర్శకులను ఆకర్షించే విధంగా ప్రత్యేక ఫ్లెక్సీల ద్వారా ఏర్పాటు చేయడంతో వాటిలో ఒక్కరోజైన ఎంజాయ్ చేయాలనే ఉద్దేశ్యంతో పర్యాటకులు వస్తున్నారు.

రిసార్ట్స్ రూమ్‌లకు భారీ అద్దెలు

తీరంలో వెలసిన రిసార్ట్‌లకు అద్దెలు వాచిపోతున్నాయి. ఒక్కొక్క రూమ్‌కు రూ. రెండు వేల నుంచి రూ.2,500లు వరకూ వసూలు చేస్తున్నారు. అద్దెకు తీసుకునేవారి వివరాలకు సంబంధించిన రికార్డులు నిర్వాహకులు నిబంధలను పాటించడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యాటకులతో పాటు, విద్యార్థులు, యువతీ యువకులు ఈ రిసార్ట్స్‌ను అద్దె తీసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. మందుబాబులు, పేకాట రాయుళ్ళు ఈ రిసార్ట్స్‌లో అహ్లాదంగా గడుపుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

నిబంధనల ప్రకారం రిసార్ట్స్ నిర్మించాలంటే 300 గజాలలోపు నిర్మాణానికి గ్రామ పంచాయతీ, అంతకు పైబడి నిర్మిస్తే టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతి పొందాల్సి ఉంది. ఈ రిసార్ట్స్ నిర్మాణం జిరాయితీ భూముల్లో జరిగినప్పటికీ వీటికి వెళ్ళే మార్గం మాత్రం సీఆర్‌జడ్ పరిధి నుంచి కంకరు రోడ్లు రిసార్ట్స్ వరకూ వేసుకున్నారు. రహదారి నిర్మాణానికి గ్రామ పంచాయతీ ఎలా అనుమతి ఇచ్చింది. సీఆర్‌జడ్ భూములు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలా అనధికార కట్టడాలకు సంబంధిత అధికారులు చేతివాటం ప్రదర్శిస్తుండటం వల్లే రిసార్ట్స్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

సకల శుభాల శ్రావణం

- నేటి నుంచి శ్రావణ మాసం
- వ్రతాలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక సంబరం



ముస్తాబవుతున్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మవారి ఆలయ ప్రాంగణం

ద్వారకాతిరుమల, ఆగస్టు 4: శ్రవణా నక్షత్ర ప్రవేశమే....శ్రావణమాసం. హిందువులకు అత్యంత పవిత్రమైన మాసం ఇది. నిత్యం ఆధ్యాత్మిక, ధార్మిక పరిమళాలతో భక్తకోటి పునీతమయ్యే పరమ పవిత్ర మాసం ఈ శ్రావణం. నెలరోజుల పాటు భగవన్నామ స్మరణలతో తెలుగు లోగిళ్ల మార్మోగనున్నాయి. నోములు, వ్రతాలు, పూజలు, ఉపవాసాలతో మహిళలు బిజీగా ఉండే శ్రావణమాసం ఈ రోజు నుంచే ప్రారంభమైంది. ఉత్తరాది వారికి సూర్యమాన క్యాలెండర్ ప్రకారం జూలై 22 నుంచే శ్రావణమాసం ప్రారంభమైంది. అయితే మనం అనుసరించే చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం ఆగస్టు 5 నుంచి శ్రావణం ప్రారంభమవుతుంది. ఆలయాలకు భక్తుల రాకను పురస్కరించుకుని క్షేత్ర దేవతగా కొలువుదీరిన కుంకుళ్లమ్మ ఆలయం ముస్తాబవుతుంది. ఆషాఢం వెళ్లిన తర్వాత శ్రావణమాసంలో కొత్తల్లుళ్ల అత్తారిళ్లకు వెళ్లడం ఇక్కడి ఆచారం. శ్రావణమాసంలో 16న వచ్చే రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

ఆధ్యాత్మిక సంతృప్తి ఇచ్చేది శ్రావణమే



అన్నివిధాల శ్రేష్టమైనది ఈ శ్రావణ మాసం. వివాహాది శుభకార్యాలు జరుగడంతో పాటు అన్ని రోజులూ దైవపూజకు, వ్రతాలకు అనుకూల మైనవే. అమ్మవార్ల ఆలయాల్లో జరిగే విశేషపూజల్లో పాల్గొంటే శుభం కలుగుతుంది.

- గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ,
వ్రత పురోహితులు, ద్వారకాతిరుమల

ఉద్యానవన పంటలకు రాయితీ

భీమవరంటౌన్, ఆగస్టు 4 : జాతీయ ఆహార నూనె గింజల పథకం కింద రూ.రెండు కోట్ల 52 లక్షల 20 వేలు మంజూరు అయినట్లు జిల్లా ఉద్యనవన శాఖ అధికారి ఆర్.దేవానంద్ కుమార్ తెలిపారు. ఈ పథకం ద్వారా 300 హెక్టార్లులో ఆయిల్‌ఫాం పంట విస్తీర్ణంను లక్ష్యంగా కేటాయించారన్నారు. దీనికి హెక్టార్‌కు దేశీయ రకానికి రూ.20 వేలు, విదేశీ రకానికి రూ.29 వేలు చప్పున రాయితీగా ఇస్తారని తెలిపారు. నాలుగేళ్లకు గాను ఏడాదికి ఎరువులు, అంతర పంటలు వేసినందుకు అదనంగా రూ.10,500 రాయితీ ఇస్తామన్నారు. 202-25 సంవత్సరంలో రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద రూ.15 లక్షల 25 వేలు 40 హెక్టార్లకు కూరగాయల అభివృద్ధి కోసం లక్ష్యంగా కేటాయించారన్నారు. సంకర కూరగాయాలు(హైబ్రీడ్) పండించినందుకు రూ. మూడు వేలు, శాశ్వత కూరగాయ పందిళ్ల వేసుకునేందుకు రూ. రెండు లక్షల 50 వేలు, చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. సంకర కూరగాయ(హైబ్రీడ్) విత్తనాలు ఉత్పత్తి చేసిన రైతులకు రూ.20 వేల చొప్పున రాయితీ ఉంటుందని దేవానంద్ కుమార్ తెలిపారు. ఈ ఏడాదికి ఉద్యానవన సమగ్ర అభివృద్ధి పథకం కింద రూ. కోటి 54 లక్షల 78 వేలు పండ్లు, పూవ్వులు, కూరగాయల అభివృద్ధి కోసం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. దీనినిమిత్తం 849.55 హెక్టార్లు లక్ష్యంగా ఉందన్నారు. ఈ పథకం కింద మామిడికి రూ.8 వేలు, జామకు రూ.18 వేలు, కోకోకు రూ.12 వేలు, పూల సాగుకు రూ.16 వేల చప్పున రాయితీ ఇస్తామన్నారు. మామిడి పునర్ధరణకు రూ.18 వేలు, ప్లాస్టిక్ మల్చింగ్‌కు రూ.16 వేలు, ప్యాక్ హౌస్ నిమిత్తం రూ.రెండు లక్షలు, కోల్డ్ స్టోరేజీ నిమిత్తం రూ.ఐదు లక్షల 25 వేలు అందజేస్తామని దేవానంద్ కుమార్ పేర్కొన్నారు. తేనిటీగల పెంపకం నిమిత్తం రూ.10 వేలు, రైతు ఉత్పత్తిదారుల సంఘానికి పంట ఉత్పత్తి, సేకరణ కేంద్రాలకు రూ.ఆరు లక్షలు, పాలీ హౌస్ ద్వారా పూలు, కూరగాయల సాగుకు రూ.46 లక్షలు రాయితీగా అందజేస్తామని తెలిపారు. ఇదే ఏడాది కొబ్బరి అభివృద్ధి బోర్డు విస్తరణ పథకం కింద 200 హెక్టార్లలో రెండు సంవత్సరాలకు రూ.6,500 చొప్పున రిజువేషన్,రీ ప్లాంటింగ్‌కు హెక్టార్‌కు రూ.53.500 కేటాయిస్తామని దేవానంద్ కుమార్ వివరించారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు

కాళ్ళ ఆగస్టు 4 : అల్లరి చేస్తున్న కొడుకుని మందలించడంతో భయపడి ఇంటి నుంచి వెళ్ళి తప్పిపోయిన బాలుడిని వెతికి సుక్షితంగా అప్పగించినట్లు కాళ్ళ ఎస్ఐ వీరభద్రరావు ఆదివారం తెలిపారు. కాళ్ళ మండలం ఏలూరుపాడుకు చెందిన ఓ బాలుడు తల్లి మందలించిందని శనివారం ఉదయం ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఆదివారం భీమవరంలో అతడి ఆచూకీ లభ్యమైంది. దీంతో పోలీసులు అక్కడి వెళ్ళి బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. 24 గంటల లోపే బాలుడి ఆచూకీ కనిపెట్టిన ఎస్ఐ, కానిస్టేబుల్స్ మహేంద్ర దీప్, సురేష్‌ను పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

చంద్రశేఖరరెడ్డి క్షమాపణ చెప్పాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 4 : గత ప్రభుత్వంలో ఉద్యోగుల సంక్షేమ విభాగానికి ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా శాఖ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి ఎన్.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఫిట్‌మెంట్ చేసినపుడు, సరెండర్ లీవులు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయినపుడు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇప్పించకుండా ప్రేక్షకపాత్ర పోషించి, నోరుమెదపకుండా ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయిన చంద్రశేఖర్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే అవాకులు, చెవాకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రశేఖరరెడ్డి తన హయాంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు తీవ్రమైన అన్యాయం చేయడమేగాక, జగన్ ప్రభుత్వానికి వంతపాడారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు సకాలంలో జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లను ఇస్తుండగా, జగన్ ప్రభుత్వం 15వ తేదీ వరకు పెండింగ్‌లోనే పెట్టిన విషయాన్ని ఉద్యోగులెవరూ మర్చిపోరన్నారు. తక్షణమే చంద్రశేఖరరెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ప్రభుత్వానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

డొక్కా సీతమ్మ పేరు హర్షణీయం



సత్యవాడ దుర్గాప్రసాద్

ఏలూరు రూరల్, ఆగస్టు 4: నిత్యాన్నదాత అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరును పాఠశాలలో పిల్లలకు పెట్టే మధ్యాహ్నం భోజన పథకానికి పెట్టడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొంతకాలం క్రితం వరకు డొక్కా సీతమ్మపేరు తెలియని వారు ఉండేవారు కాదన్నారు. అన్నదానం చేసి మానవత్వానికి అర్థం చెప్పిన డొక్కా సీతమ్మ పేరు మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం హర్షనీయమన్నారు. పేదల కడుపునింపే అన్న క్యాంటీన్ మూసేసి కడుపుకొట్టిన వైసీపీకి ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు.

కాశీ యాత్రకు వెళ్ళిన భక్తుడి అదృశ్యం



బాదరాల కోటయ్య

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 4 : ఈ నెల ఒకటో తేదీన బస్సులో కాశీ యాత్రకు వెళ్ళిన బాదరాల కోటయ్య(70) మూడో తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పుట్లగట్లగూడెంకి చెందిన కోటయ్య అదే గ్రామానికి చెందిన మరో 40 మందితో కలిసి కాశీ వెళ్లారు. వారణాసిలో బస్సు దిగినప్పటి నుంచి కనిపించక పోవడంతో తోటి ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. జిల్లా అధికారులు స్పందించి అక్కడి అధికారులతో మాట్లాడి కోటయ్య ఆచూకీ కనుగొనేలా చర్యలు తీసుకోవాలని కోటయ్య కుమారుడు బాబూరావు కోరుతున్నారు.

జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సక్సెస్

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన దాతలు, ప్రభుత్వం



శస్త్రచికిత్స ముగిసిన తర్వాత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్యులు, జ్ఞానేశ్వరి (శస్త్ర చికిత్సకు ముందు)

ఏలూరు అర్బన్, ఆగస్టు 4 : కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్ర చికిత్సకు అవసరమైన ఆర్థిక స్థోమతలేక దాతల సాయం కోసం అర్థిస్తూ గత వారం రోజులుగా ఎదురుచూస్తున్న ఏలూరుకు చెందిన బాలిక కోటం జ్ఞానేశ్వరికి ఎట్టకేలకు ఆపరేషన్ పూర్తయింది. తమిళనాడు పెరుంబాక్కంలోని గ్లెనిగల్స్ హెల్త్‌సిటీ చెన్నై హాస్పిటల్‌లో చీఫ్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ నేతృత్వంలోని వైద్యుల బృందం జ్ఞానేశ్వరికి శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఆదివారం తెల్లవారు జాము 2.30 గంటల వరకు నిర్వహించిన లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్టు బాలిక కుటుంబ సభ్యులు తెలిపారు. బాలికకు వివిధ వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్స, ఆపరేషన్ అనంతరం పర్యవేక్షణ కాలానికి రూ.40 లక్షలు అవసరమవుతాయని వైద్యులు అంచనావేయగా, అంత భారీ మొత్తంలో ఖర్చు భరించే స్థోమత జ్ఞానేశ్వరి తల్లిదండ్రులకు లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ దాతల సాయం కోసం 'ఆదుకోండి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 30న ఓ ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనం అదే రోజు నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయింది. పలు ప్రాంతాల నుంచి స్పందించిన దాతలు తమ విరాళాలను జ్ఞానేశ్వరి తల్లి దుర్గకు ఫోన్‌పే ద్వారా, బ్యాంకు చెక్కుల రూపంలో పంపించారు. మరోవైపు బాలిక ఆరోగ్యస్థితిని తెలుసుకున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి నేరుగానే జోక్యం చేసుకుని కుటుంబ సభ్యులను వెంటపెట్టుకుని సీఎం కార్యాలయానికి తీసుకెళ్ళి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపరేషన్‌కు అవసరమైన నిధులను విడుదల చేయాల్సిందిగా కోరారు. దీంతోపాటు మంత్రి లోకేష్ వ్యక్తిగత సహాయకుడు కూడా జ్ఞానేశ్వరి శస్త్ర చికిత్సకు ప్రభుత్వం నుంచి నిధులు అందజేస్తామని, ఆ మేరకు ఎల్‌వోసీని పంపిస్తామని ఆస్పత్రి యాజమాన్యానికి చెప్పారని వివరించారు. ప్రస్తుతం ఇది ఫైనల్ ప్రాసెస్‌లో ఉందని బాలిక కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ లోగా బాలిక ఆరోగ్యస్థితి క్షీణిస్తుండడంతో దాతలు అందించిన విరాళాల మొత్తం రూ.10.50 లక్షలను చెల్లించగా, మిగతా మొత్తానికి జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యుల నుంచి హామీ తీసుకుని శనివారం శస్త్ర చికిత్స చేశారని వివరించారు. తల్లి దుర్గ కాలేయం మ్యాచ్ కావడంతో అందులో 40 శాతం భాగం సేకరించి, కుమార్తె జ్ఞానేశ్వరికి ఆపరేషన్ ద్వారా అమర్చారు. ఇలా తన లివర్‌లో కొంతభాగాన్ని కోల్పోయిన తల్లి దుర్గ కొంతకాలానికే మెడిసన్‌తో పూర్తిస్థాయిలో రీప్లేస్ అవుతుందని వైద్య నిపుణులు చెప్పారని తెలిపారు. కాగా పూర్తిగా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ జరిగిన జ్ఞానేశ్వరికి అమర్చిన కాలేయం శరీరంలో కలిసి అడ్జస్ట్ చేసుకోవడానికి కనీసం ఆరు నెలలు వైద్యుల పర్యవేక్షణ అవసరమవుతుందని పేర్కొన్నారు. తల్లి దుర్గ ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంతో ఉండగా, కుమార్తె మాత్రం మిగతా అవయవాలు సాధారణ స్థితిలో పని చేసే వరకు కనీసం రెండు రోజులు ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచాలని వైద్యులు చెప్పారని వివరించారు. ఇక ప్రభుత్వం నుంచి ఆపరేషన్ నిర్వహించిన ఆస్పత్రికి ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఎంత మొత్తానికి ఇస్తారో సోమవారం తేలుతుందని భావిస్తున్నామని, లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ శస్త్ర చికిత్స నిమిత్తమే రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, మరికొంత మొత్తం పోస్ట్‌ఆపరేటివ్ కేర్ ఖర్చుల నిమిత్తం అవసరం ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు

ఆపరేషన్ ఖర్చులు భరించే స్థోమతలేక తీవ్ర ఆందోళనలోవున్న జ్ఞానేశ్వరి దీనస్థితిని బయట ప్రపంచానికి తెలిసేలా ప్రత్యేక కథనంతో దాతలు పెద్దసంఖ్యలో ముందుకువచ్చి ఎవరికితోచిన సాయంవారు అందించేలా కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి, అలాగే తమకు ఆర్థికంగా అండగా నిలిచిన ప్రతిఒక్కరికి బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ఆలయ చెరువు లీజుకు వేలం

ముదినేపల్లి, ఆగస్టు 4: ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని శ్రీ సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయానికి చెందిన గుడివాడ రూరల్ మండలంలోని మోటూరు గ్రామ పరిధిలోగల 111 ఎకరాల చేపల చెరువును లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 5న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. చెరువులో చేపలు పెంచుకోవటానికి మూడేళ్ల కాలపరిమితికి లీజుకు ఇవ్వనున్నట్లు, వేలాన్ని మోటూరు గ్రామ సచివాలయం వద్ద నిర్వహిస్తామని ఈవో తెలిపారు.



అలరించిన నృత్యాలు

ఏలూరు రూరల్, ఆగస్టు 4: నాట్యం అపురూపం, అనిర్వచనీయం, అద్వితీయం, కళాకారుల నాట్య ప్రదర్శన పదాలకు తగ్గట్లు భంగిమలు, భంగిమలకు తగ్గట్లు హావభావాలతో నాట్యకళాకారులు ప్రేక్షకుల మదిని దోచారు. కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అభినయ నృత్యభారతి సంస్థ రెండు రోజుల పాటు ఏలూరు వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 9వ జాతీయ స్థాయి నర్తనబాల అవార్డుల కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 160 మంది చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. నర్తన బాల అవార్డులు స్వీకరించారు. ముగింపు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎంవీ ప్రసాద్ హాజరై మాట్లాడారు. మన వేదాల్లో ఉన్న పురాతన కళలను కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. భారతదేశం భరత నాట్యం, కూచిపూడి తదితర నాట్యాలు సంగీత వాయిద్య కళల సమూహం అన్నారు. భారతీయ జీవన విధానం మన సంస్కృతి పై ఆధారపడి ఉంటుందన్నారు. వేదాల్లోని సంస్కృతిని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారని అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు వారి ప్రదర్శనలతో ప్రేక్షకులను రంజింప చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కర్‌రావు, అడుసుమిల్లి నిర్మల, డాక్టర్ డి.సుబ్బారావు, జి.లలితశర్మ, ఎం.కోటేశ్వరరావు, కోటేశ్వరరావు, కేబీ రావు, నాట్యాచార్య దువ్వి హేమసుందర్ పర్యవేక్షించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఏలూరు సిటీ, ఆగస్టు 4: : ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారితో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ముగ్గురికి ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ?

ఆకివీడు రూరల్ ఆగస్టు 4 : కోళ్ళపర్రు గ్రామానికి చెందిన 18 సంవత్సరాలు యువకుడికి, ఆకివీడు పట్టణంలోని జవహర్‌పేట, సాయి నగర్‌లోని వ్యక్తులకు ఇన్‌ఫ్లూయెంజా వైరస్ సోకినట్లు సమాచారం. గత కొద్ది రోజులుగా జలుబు, జ్వరంతో బాధపడుతున్న వీరిని ఆకివీడు సీహెచ్‌సీలో నిర్వహించిన ప్రాథమిక పరీక్షలో పాజిటివ్ అని తేలింది. అయితే ఈ రిపోర్టును వైద్య సిబ్బంది ఉన్నతాధికారులకు పంపారు. ఆ ముగ్గురిని ఐసోలేషన్ నిమిత్తం ఇంటికి పంపినట్లు వారు తెలిపారు.

అన్న క్యాంటీన్



కైకలూరు ఆగష్టు 4: ప్రతి రోజు అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వా నిదేనని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం కైకలూరులో 47వ రోజు అన్నక్యాంటీన్‌ను టీడీపీ నాయకుడు పొత్తూరి వాసురాజు ఆర్థిక సాయంతో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రతి రోజు దాతల సహకారంతో నిర్విరామంగా ప్రజలకు భోజనాన్ని అందిస్తున్నామన్నారు. టీడీపీ నేతలు పూల రామచంద్రరావు, ఎంఏ రహీం, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కౌలు రైతు ఆత్మహత్య



రామకృష్ణ (ఫైల్)

పోలవరం, ఆగస్టు 4 : అప్పుల బాధతో కలుపు మందు తాగి కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోలవరం మండలం గూటాలలో ఆదివారం జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పలకంశెట్టి రామకృష్ణ (41) అప్పు చేసి 15 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. ఇటీవల వర్షాలు, వరదలకు పంటలు పూర్తిస్థాయిలో నష్టపోవడంతో అప్పులు తీర్చే మార్గంలేక కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు అతనిని వైద్య చికిత్సల నిమిత్తం తాళ్ళపూడిలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ రామకృష్ణ మృతి చెందడంతో కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

మహిళ మృత దేహం గుర్తింపు



పి.వెంకాయమ్మ (ఫైల్)

జంగారెడ్డిగూడెం, ఆగసు 4 : పంగిడిగూడెం గ్రామ శివారు వద్ద ఎర్రకాలువ గట్టు పక్కన గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని స్థానికులు గుర్తించి జంగారెడ్డిగూడెం పోలీసులకు సమాచారమందించారు. ఎస్సై జ్యోతి బసు ఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం గ్రామానికి చెందిన పంపన వీర వెంకాయమ్మ (55) అని ఆమె కుమారుడు వచ్చి గుర్తించినట్లు తెలిపారు. ఆమెకు మతిస్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వెళ్ళి మళ్ళీ తిరిగి ఒకటి రెండు రోజుల్లో ఇంటికి చేరుకునేదన్నారు. కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్ళిపోయి కాకినాడలోని ఒక గుడి దగ్గర ఉండడంతో కుటుంబ సభ్యులు వెళ్ళి ఇంటికి తీసుకువచ్చారన్నారు. నాలుగు రోజులు క్రితం బయటకు వెళ్ళిన వెంకాయమ్మ తిరిగి ఇంటికి చేరుకోక పోవడంతో సోమవారం కాకినాడ వెళ్ళడానికి కుటుంబ సభ్యులు సిద్ధపడుతుండగా ఆదివారం ఇలా జరిగిందన్నారు. మతిస్థిమితం లేక పోవడంతో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటుందని ఆయన తెలిపారు. పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడి గల్లంతు



జాన్‌బాబు(ఫైల్)

మొగల్తూరు/తణుకు ఆగస్టు 4 : స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చిన ఒక యువకుడు సముద్ర స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. తణుకు పాత ఊరుకి చెందిన కొల్లు జాన్‌బాబు (17) అతని స్నేహితులు పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. వీరంతా స్నాంచేస్తుండగా జా న్‌బాబు సముద్ర కెరటాలు ఉధృతంగా రావడంతో గల్లంతయ్యా డు. జాన్‌బాబు తణుకులో ఒక ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. జాన్‌బాబు కోసం స్థానిక పోలీసులు, స్నేహితులు తీరం వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. జాన్‌బాబు తండ్రి బాబురావు చెప్పులు కుట్టు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న చెల్లెలు ఉంది.

యువకుడికి తీవ్ర గాయాలు

ఆకివీడు, ఆగస్టు 4 : లారీ తప్పించపోయి ఢీకొట్టి పడిపోయిన యువకుడు మీద నుంచి ఆటో వెళ్లడంతో కుడికాలు నుజ్జునుజ్జయింది. భీమవరం గునుపూడికి చెందిన సుగుణ స్థానిక మీషో ఆఫీసులో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భీమవరం ఇంటికి వెళ్ళుతుండగా స్థానిక గుమ్ములూరు సెంటర్ లో వెళ్ళుతున్న లారీని తప్పించబోయి ఆ లారీనే ఢీకొని కిందపడపోయిన సుగుణ పై నుంచి ఆటో వెళ్ళడంతో కుడికాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు పోలీసులు, 108కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి పంపించి కేసు నమోదు చేశారు. మెరుగైన చికిత్స కోసం రాత్రి విజయవాడ తరలించారు.

యువకులపై కేసు నమోదు

పాలకోడేరు, ఆగస్టు 4: పాతగొడవలు పుస్కరించుకుని ఒక యువకుడిపై దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. విషయానికి వస్తే పాలకోడేరుకి చెందిన దళిత వర్గానికి చెందిన కొంతమంది యువతకులు, బీసీ వర్గానికి చెందిన మరి కొంతమంది యువకులు భీమవరంలోని జగదీష్ మెరైన్ కంపెనీలో పని చేస్తున్నారు. అయితే ఈ రెండు వర్గాల మధ్య 20 రోజులుగా పాత గొడవల నేపథ్యంలో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం దళిత వర్గానికి చెందిన ఒక యువకుడ్ని బీసీ వర్గానికి చెం దిన కొంతమంది యువకులు తీవ్రంగా గాయపరి చారు. దీంతో దళిత వర్గం యువకులు ఒక్కటిగా చేరడంతో పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు చాకచక్యంగా వ్యవహరించడంతో గొడవ తప్పిందని స్థానికులు అంటున్నారు. గాయపడ్డ యువకుడు కంకిపాటి అభి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యా భర్తలపై దాడి

భీమడోలు, జూలై 4 : గుండుగొలనులో ఆదివారం భార్యాభర్తలపై ఒక వ్యక్తి రాయితో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన ముప్వా రాంబాబు తన ఇంట్లో కుక్కలు ఎటో వెళ్ళిపోయాయంటూ తిడుతున్న నేపథ్యంలో ఇదే కాలనీలో ఉంటున్న నత్తాపోతు రాజు తనన్నే తిడుతున్నావంటూ ఘర్షణకు దిగాడు. పోతురాజు, రాంబాబు, అతని భార్య నిర్మలపై రాయితో దాడి చేశారు. భార్యాభర్తలు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉంటే గాయాలైన బాధితులు తమపై దాడి చేసి భార్య మెడలో బంగారు గొలుసు తీసుకుని అసభ్యంగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భర్త, అత్త మామలపై ఫిర్యాదు

ఆకివీడు, ఆగస్టు 4 : భర్త, అత్త మామలు మానసకంగా, శారీరకంగా హింసిస్తున్నట్లు భార్య ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చినకాపవరంనకు చెందిన మద్ది సువర్ణ సావిత్రిని భీమవరం మండలంలోని కొమరాడ గ్రామానికి చెందిన మద్ది దేవిద్రాజుకిచ్చి 2018 వివాహం చేశారు. అప్పటి నుంచి తన భర్త దేవిద్రాజు, అత్త, మామ చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో సువర్ణ సావిత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్టు

పెదపాడు, ఆగస్టు 4 : పెదపాడు మండలం తాళ్లగూడెంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ఇద్దరు పేకాటరాయుళ్లతో పాటుగా రూ.2,200లు నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా పట్టివేత

లింగపాలెం, ఆగస్టు 4: మండలంలోని యడవల్లిలో సారా అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసు కున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం యడవల్లి గ్రామంలో ఓ వ్యక్తి మోటారు సైకిల్ పై సారా తీసుకువచ్చి గ్రామంలో అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్సై చెన్నారావు తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి ఐదులీటర్ల సారా, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో ఆయనతో పాటు వీఆర్వో సందిపాము వీరయ్య, వీఆర్ఏ ఏసు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యానాం మద్యం తరలిస్తున్న ఇద్దరి యువకుల అరెస్టు

పాలకోడేరు, ఆగస్టు 4 : యానాం నుంచి 43 టిన్ బీర్ బాటిల్స్ తరలిస్తున్న భీమవరంనకు చెందిన ఇద్దరు యువకులను పెన్నాడ గ్రామంలో ఆదివారం అదుపులోకి తీసుకుని వారి పై కేసు నమోదు చేసి రిమైండ్‌కు తరలించినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

కారును ఢీకొట్టడంతో ఫిర్యాదు

ఆకివీడు, ఆగస్టు 4 : ఐషర్ వ్యాన్ రివర్స్ చేస్తూ తన కారును ఢీకొట్టడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆకివీడుకు చెందిన కేశిరెడ్డి గోపాలకృష్ణ ఉండి మండలం చెరుకువాడ పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నారు. ఈ నెల 2న గోపాలకృష్ణ తన కారులో భీమవరం వెళ్తుండగా ఆకివీడు ఎంపీడీవో కార్యాలయం దగ్గర జాతీయ రహదారికి వెళ్ళే సరికి ఐషర్ వ్యాన్ రివర్స్ చేస్తూ ఢీకొనడంతో కారు పూర్తిగా దెబ్బతింది. గోపాలకృష్ణ ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం, ఆగస్టు 4: ఏజెన్సీ ప్రాంత ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భారీ వర్షాల కారణంగా అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. శనివారం నుంచి పునరుద్ధరించడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయానికి వెళ్లే రహదారులు వాగుల ఉధృతికి కొట్టుకుపోగా ఆలయం వద్ద అమ్మ వారి మెట్లమార్గం కూడా దెబ్బతింది. ఆలయ కమిటీవారు దర్శనాలను నిలిపివేసి రహదారులు, మెట్లమార్గాన్ని మరమ్మతు చేయించారు. దర్శనాలకు అవకాశం కల్పించడంతో భక్తులు ఏజెన్సీ బాట పట్టారు. భక్తుల కోసం కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు. వాతావరణం బాగోలేనందున భక్తులు త్వరగా అమ్మవారి దర్శనాలను ముగించుకుని బయటకు వెళ్ళాలని సూచించారు.

ద్వారకాతిరుమల క్షేత్రంలో తగ్గిన భక్తుల రద్దీ

ద్వార కాతిరుమల, ఆగస్టు 4: చిన వెంకన్న క్షేత్రం అమావాస్య ప్రభావంతో భక్తుల రాక పలచగా ఉంది. ఆలయంలోని అన్ని విభాగాలు దాదాపు ఖాళీగా కనిపించాయి. ఆదివారం సెలవుదినం కావడంతో శ్రీవారి క్షేత్రానికి సాధారణంగా అమావాస్య కావడంతో ఆలయానికి కేవలం వందల సంఖ్యలోనే యాత్రికులు తరలివచ్చారు. దేవస్థానం, ప్రైవేటు ఫ్యాన్సీ దుకాణాలు మధ్యాహ్నానికి మూత పడ్డాయి. రానున్నది శ్రావణ మాసం కావడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరగవచ్చని దేవాలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి ఆగస్టు 4: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం అమా వాస్య కావడంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

నూకాలమ్మకు ఆషాఢం సారె.. పూజల్లో ఎమ్మెల్యే చంటి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 4: అమ్మవారి దీవెనలతో ప్రజల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగు నింపుతుందని ఎమ్మెల్యే చంటి అన్నారు. కొత్తపేట నూకాలమ్మకు ఆషాఢ మాస సారె, పూజల్లో ఆయన పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు 108రకాల స్వీట్లు, పండ్లు, పిండివంటలతో ఆలయానికి ఊరేగింపుగా అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు ఎం.రామకృష్ణ, టీడీపీ నాయకులు రంగారావు, జంపా సూర్యనారాయణ, కరణం రాజు, సురేష్, రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చంటిని ఘనంగా సన్మానించారు.

గూటాల కనకదుర్గ ఆలయంలో చండీ హోమం



చండీ హోమంలో నిర్వహిస్తున్న వేద పండితులు

పోలవరం, ఆగస్టు 4: గూటాల గోదావరి తీరాన కనకదుర్గ ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం అమ్మవారికి గారెలు, చెరుకు గడలు, పండ్లు చక్కెర పొంగలి మహా నైవేద్యం సమర్పించారు. అర్చకులు, వేద పండితులు సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్ శాస్త్రి, శంకర శాస్త్రి, రాజశేఖర శాస్త్రి, హెచ్‌వి ప్రవీణ్ శాస్త్రి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి ఆలయంలో విశేష పూజలు

వేలేరుపాడు, ఆగస్టు 4: ఆషాఢ అమావాస్య ఆదివారం సందర్భంగా భూదేవిపేట చాముండేశ్వరి ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నందీశ్వరస్వామి, జోడినేని అనిల్‌కుమార్ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త భూమా శ్రీధర్, దుర్గా దంపతులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాలకు ఆలయాలు ముస్తాబు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 4: నగరంలోని అమ్మవారి ఆలయాల వద్ద సోమవారం నుంచి శ్రావణ మాసోత్సవాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను శుభ్రం చేసి విద్యుత్ దీపాలు, ఫ్లెక్సీలు, కటౌట్‌లు, సామూహిక పూజలు నిర్వహించేందుకు తాత్కాలిక వేదికలు ఏర్పాటు చేశారు. అంబికాదేవి, సౌభాగ్య లక్ష్మీదేవి, మహిషాసురమర్దిని, బాల త్రిపుర సుందరి, కనకదుర్గమ్మ, కాశీ అన్నపూర్ణాదేవి, జ్ఞాన సరస్వతీదేవి, రాజ్యలక్ష్మిదేవి అమ్మవార్ల ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు.

మొక్కుబడిగా మండల పరిషత్ సమావేశం

సమస్యల చిట్టా విప్పిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

కొయ్యలగూడెం, ఆగస్టు 4: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఆదివారం మధ్యాహ్నం జరగాల్సిన సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఎంపీపీ గంజిమాల రామారావు అధ్యక్షతన సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ సమస్యల గురించి ప్రస్తావించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు. సమావేశం ఏర్పాటు చేయడంతో ప్రజాప్రతినిధులంతా ఆలస్యంగా సమావేశానికి హాజరయ్యారు. వివిధ పథకాలపై సభ్యులతో అధికారులు చర్చించారు. వర్షాకాలం కావడం వలన పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని కోరారు.

11న కాపు వధూవరుల వివాహ పరిచయ వేదిక

ఏలూరు అర్బన్, ఆగస్టు 4: కాపు, తెలగ, బలిజ, ఒంటరి అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న వన్‌టౌన్ గాంధీ మైదానం సమీపంలోని సంఘ భవనంలో కాపు వధూవరుల నిమిత్తం వివాహ పరిచయవేదిక నిర్వహిస్తున్నట్టు సంఘ జిల్లా అధ్యక్షుడు జెట్టి సింహాద్రిరావు తెలిపారు. వధువు/వరుడు బయోడేటా, ఫోటోలతోసహా హాజరుకావాలని కోరారు. ఎటువంటి ప్రవేశ రుసుం చెల్లించనవసరం లేదన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు : ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 4: విద్యార్థులు ఇష్టపడి చదువులు చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఎస్పీ కేపీఎస్.కిశోర్ అన్నారు. జిల్లాలోని పోలీస్ సిబ్బంది కుమారులు, కుమార్తెలు ఉన్నత చదువుల్లో ప్రతిభ కనబర్చడంతో పోలీస్ వెల్ఫేర్ సంఘం నుంచి వచ్చిన నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను విద్యార్థులకు ఆదివారం ఎస్పీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ అవార్డులు పొందిన విద్యార్థులను మిగిలిన పోలీస్ సిబ్బంది పిల్లలు ఆదర్శంగా తీసుకుని, వారు కూడా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. పిల్లలు ఇష్టంగా చదివితే ఆ తల్లిదండ్రులు ఎంతో ఆనందంగా సమాజానికి మెరుగైన సేవలందిస్తారన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యతో భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా ప్రతిభ కనబర్చిన 32 మంది పిల్లలకు స్కాలర్‌షిప్ మంజూరు చేశామన్నారు. విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.స్వరూపరాణి, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, పోలీస్ అధికారుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ

సాగునీటి సరఫరాపై ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే చింతమనేని



రైతులతో కలసి తోటగూడెం వద్ద కృష్ణా కాలువ పరిశీలిస్తున్న చింతమనేని

పెదపాడు, ఆగస్టు 4: రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సాగునీటి కష్టాలను గట్టెక్కించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ భరోసానిచ్చారు. ఏలూరు - విజయవాడ కృష్ణా కాలువ శివారు ఆయకట్టులో సీతంపేట కెనాల్, ఏలూరు రూరల్, పెదపాడు ఆయకట్టులోని ప్రాంతాల రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. పెదపాడు మండలంలోని వసంతవాడ, తోటగూడెం ప్రాంతాల్లో కృష్ణా కాలువను రైతులతో కలసి ఎమ్మెల్యే చింతమనేని ఆదివారం పరిశీలించారు. సాగునీటి కొరత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువలో గుర్రపు డెక్క, బద్దనాచు, కర్ర భారీగా పేరుకుపోయిందని, తొలగించేందుకు ట్రాక్టర్లతో దమ్ము చేయాల్సిన అవసరముందని అధికారులు సూచించారన్నారు. నాలుగురోజుల పాటు నీటిని నిలుపుదల చేసి కాలువలో అడ్డంకులను తొలగించి సాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గుత్తా అనిల్, పెదపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ బొప్పుడి కాశీబాబు, పెద్దిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లను అందిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ సమస్యలపై పలువురు వినతులు అందించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను అందిస్తామన్నారు. పేదల వైద్యానికి సంబంధించి, ఎన్టీఆర్ వైద్యసేవతోపాటు అదనంగా ముఖ్యమంత్రి సహాయ నిధిద్వారా నిధులు అందించే ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. పేదవానికి ఇంటిస్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు అందిస్తామని ప్రభాకర్ వివరించారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి: ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ఆర్యవైశ్యులు ఎంతో మద్దతు ఇచ్చారని, వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యేకు అభినందన సభ నిర్వహించారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో ఆర్యవైశ్యులు ఏ ఇబ్బంది వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏఎంసీ ఛైర్మన్, నామినేటెడ్ పదవుల్లో కూడా ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించాలని పలువురు కోరారు. ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పక్కాల వెంకటేశ్వరరావు, కొత్తపూడి శేషగిరిరావు, చిట్టూరి ధర్మరాజు, మాటూరి చక్రధర్‌రావు, మాడా శ్రీనివాసరావు, మాడా సత్యనారాయణ, కక్కిరాల ఉపేంద్ర, పలువురు పాల్గొన్నారు.



ముందూరులో పాలాభిషేకం



ఎమ్మెల్యే బాలరాజుకు యువత కృతజ్ఞతలు



వీరిశెట్టిగూడెంలో ఎమ్మార్పీఎస్ సంఘీభావం

ఎమ్మార్పీఎస్ ఉద్యమ లక్ష్యం నెరవేరింది

పెదవేగి, ఆగస్టు 4: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణతో ఉప కులాలకు న్యాయం జరుగుతుందనే ఆలోచనతో చేపట్టిన 30 ఏళ్ల ఉద్యమ లక్ష్యం నెరవేరిందని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు అన్నారు. మాదిగలకు న్యాయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకరించారని ముందూరు గ్రామ దళితులు ఆదివారం రాత్రి చంద్రబాబు, మందా కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టుపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. బలుసు శ్రీనివాస్‌చౌదరి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యపడుతుందన్నారు. వర్గీకరణ మాదిగల చిరకాల కోరిక అని, ఎస్సీ ఉపకులాలకు మరింత మేలు జరుగుతుందన్నారు. అన్నపనేని సురేష్, భీమడోలు ఏడుకొండలు, నాగబాబు, శివ, జోజి, కొలుకులూరి దుర్గయ్య, నాగేసు, నాము ధర్మయ్య, మానుకొండ జానీ, భీమడోలు కుమారి, రంగమ్మ రమణ, నాము పెంటమ్మ పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు సానుకుల తీర్పుతో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేశారు. సుప్రీం తీర్పుతో తమకు న్యాయం జరుగుతుందని జగదాంబ ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం డప్పులు వాయిస్తూ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఎమ్మార్పీఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. తగరం ఎర్రయ్య, అలెగ్జాండర్, జాలా వంశీ ఉన్నారు.

● కామవరపుకోట: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుతో వీరిశెట్టిగూడెంలో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బారతాల రమేష్ మాదిగ మాట్లాడుతూ 54 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని, భారత రాజ్యాంగం ప్రకారమే అందరికీ సముచిత న్యాయం అందుతుందన్నారు. 30 ఏళ్ల పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో మోక్షం లభించిందన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయకుండా పని సర్దుబాటు సరికాదు : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 4: ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులకు శాపంగావున్న జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయకుండా ప్రభుత్వం హడావుడిగా టీచర్ల పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) ప్రక్రియను చేపడుతుండడంపై ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర అభ్యంతరం తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో 117 రద్దుచేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌తో అనేక పాఠశాలల్లో ఎస్జీటీలు మిగులు (సర్‌ప్లస్)గా చూపించబడతారన్నారు. పాఠశాలలు ప్రారంభమై ఇప్పటికే నెల దాటిందని, తక్షణమే హైస్కూళ్లలో తెలుగు మాధ్యమం కూడా కొనసాగించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణతో ఖాళీలను ఇన్ సర్వీస్ టీచర్లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరతలేకుండా చూడాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలను కూడా ఎస్జీటీలుగా పరిగణిస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. కీలకమైన సమస్యలు పరిష్కరించకుండా వర్క్ అడ్జస్ట్‌మెంట్ సరికాదని, విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

స్టాప్ డయేరియా కార్యక్రమం

ఏలూరు టూటౌన్, ఆగస్టు 4: స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి అన్నారు. ఎన్ఆర్.పేట, గ్రాండ్ ఆర్యా, రైల్వే ట్రాక్‌రోడ్డులో పారిశుధ్య పనులు చేపట్టారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్, ఆయిబాల్స్ వేశారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, దుర్గారావు, ఏడుకొండలు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా డెల్టా శివారు భూములకు సాగు నీరు ఇవ్వాలి

పెదపాడు, ఆగస్టు 4: కృష్ణా డెల్టా శివారు భూములకు సాగు నీరు అందించాలని వట్లూరు రైతులు డిమాండ్ చేశారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో కృష్ణా డెల్టా రైతులకు సాగు నీరందక నాట్లు వేయలేక ఇబ్బందులు పడుతున్నారని, వేసవిలో కాలువ ఆధునికీకరణ, కర్ర నాచు, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేయకపోవడమే కారణమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. వట్లూరు ఆయకట్టు పరిధిలో 3 వేల ఎకరాలకు నారు ఎదిగినా నాట్లు వేయకపోవడంతో భూములు బీడులుగా మారుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. కొమ్మన సాంబశివరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యామినీ కృష్ణమూర్తి మృతి కళారంగానికి తీరనిలోటు

టి.నరసాపురం, ఆగస్టు 4: భరతనాట్యంలో జాతీయ గుర్తింపు పొందిన సీనియర్ కళాకారిణి యామిని కృష్ణమూర్తి మృతి తీరని లోటని పలువురు కళాకారులు అన్నారు. ఆమె మృతికి ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా గౌరవాధ్యక్షుడు సబ్బి కనకారావు, ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ టీవీఎస్ రాజు, ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ ఆదివారం సంతాపం తెలిపారు. విభూది రాజేశ్వరి, ఎం.ప్రేమానందం, బొందలపాటి పద్మావతి, తోట సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.ఆర్ కృష్ణబాబు, రంగస్థల సీనియర్ కళాకారుడు తిరుపతి రమేష్‌బాబు కూడా సంతాపం తెలిపారు.

గ్రంథ పఠనం అభివృద్ధికి చిహ్నం

పెదవేగి, ఆగస్టు 4: గ్రంథ పఠనం అభివృద్ధికి చిహ్నమని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. గ్రంథాలతో గడిపే ప్రతిక్షణం ఎంతో విలువైనదన్నారు. పుస్తక పఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు.

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

లింగపాలెం, ఆగస్టు 4: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యమని పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని డాక్టర్ యానిప్రీతి సూచించారు. ధర్మాజిగూడెం పీహెచ్‌సీ పరిధిలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు టీకాలను క్రమం తప్పకుండా వేయించాలన్నారు. పద్మజ, మంజీర, భవాని, విమల, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 4: పట్టణానికి చెందిన పద్మనాభుని గాయత్రి ఇంజనీరింగ్ విద్యకు కిరాణా వ్యాపారి దూబగుంట్ల వెంకటేశ్వరరావు ఆదివారం రూ.25 వేలు ఆర్థిక సాయమందించారు. మూడేళ్ల నుంచి విద్యార్థినికి ఆయన ఆర్థిక సహాయమందిస్తున్నారు. చివరి సంవత్సరం కూడా సహాయమందించడంతో విద్యార్థిని గాయత్రి దాత వెంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపింది. గొల్లపూడి మురళీకృష్ణ, కె.శ్యామసత్యనారాయణ, బివి.సత్యనారాయణ, గుడిమెట్ల కుమార్, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 4: అవసరంలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజా వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ఆదేశించారు. ఇటీవల లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న చిన్నారి జ్ఞానేశ్వరి వైద్య సహాయం నిమిత్తం కోట సత్యనారాయణ బృందం రూ.34,600 ఎమ్మెల్యే చంటి అందజేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, తదిరతులు పాల్గొన్నారు.

ఫ్లాష్ స్వచ్ఛంద సేవలు మరువలేనివి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 4: ఫ్లాష్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలు మరువలేనివని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పోలీస్ కల్యాణ మండపంలో ఆదివారం స్నేహ హస్తం - ప్రకృతే మన నేస్తం పేరిట ఫ్రెండ్ షిప్ డే నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ చనిపోయిన వారికి ఫ్రీజర్ బాక్సులు, అంతిమయాత్ర వాహనాలు, అంబులెన్స్‌లతో సేవలందిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కె.విశ్వనాథం, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ బడేటి వెంకటరామయ్య, మామిళ్ళపల్లి పార్థసారథి, చంద్రశేఖర్, మనోజ్, అమరావతి అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కొత్త ఫ్రీజర్ బాక్సులను ప్రారంభించారు.

ప్రమాదంలో గాయపడిన చిన్నారికి మానవత సాయం

పోలవరం, ఆగస్టు 4: కమ్మరగూడెం గ్రామానికి చెందిన చిన్నారి మరపట్ల భవ్య రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో వైద్య ఖర్చులకు మానవత మండల అధ్యక్షుడు పోసిబాబు ఆధ్వర్యంలో ఆదివారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. సభ్యులు షెహిన్షా బాషా, పోతుల చిరంజీవి, కెరాంబాబు, చిలకా రాంబాబు, సొబ్బన మోహన్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ డివిజన్ స్థాయి శిక్షణ తరగతులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 4: స్థానిక ధర్మన్న స్మారక భవనంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) డివిజన్ స్థాయి శిక్షణ తరగతులు డివిజన్ కార్యదర్శి మంచిలి రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కెవి.రమణ, సరియం రామ్మోహన్, న్యాయవాది ఏసుబాబు, కొమరం మారమ్మ, బుజ్జయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వండి

జంగారెడ్డిగూడెం కూటమి నేతల విజ్ఞప్తి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 4: చింతలపూడి ఏఎంసీ ఛైర్మన్ పదవితో పాటు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులను జంగారెడ్డిగూడెం పట్టణ నేతలకు కేటాయించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ కోరారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో ఆదివారం కూటమి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. రావూరి కృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికోసం, అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, గడచిన ఎన్నికల్లో పట్టణం నుంచి 12 వేల మెజారిటీ ఇచ్చామన్నారు. పట్టణంలో నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇవ్వలేదన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం పోలవరం నియోజకవర్గంలో ఉన్నప్పుడు, చింతలపూడి నియోజకవర్గంలో కలసిన తర్వాత ఏఎంసీ ఛైర్మన్ పదవి పట్టణ నేతలకు దక్కలేదన్నారు. పట్టణంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకులకు ప్రాధాన్యం కలిగిన పదవులను ఇవ్వాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణానికి చెందిన కూటమి నాయకులకు ఏఎంసీ ఛైర్మన్ పదవిని ఇవ్వా లని కోరారు. టీడీపీ నాయకుడు పరిమి సత్తిపండు మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ఎంతోమంది సీనియర్, మహిళా నాయకులు నామినేటెడ్, చింతలపూడి ఏఎంసీ ఛైర్మన్ పదవికోసం ఎదురుచూస్తున్నారన్నారు. పార్టీ అధిష్ఠానం, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే రోషన్ కుమార్ జంగా రెడ్డిగూడెం పట్టణ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, అబ్బిన దత్తాత్రేయ, నంబూరి రామచంద్రరాజు, తూటిగుంట రాము, పగడం సౌభాగ్యవతి, కరుటూరి రమాదేవి, మారిశెట్టి బాలచిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.



కూటమి సమావేశంలో మాట్లాడుతున్న రావూరి కృష్ణ



స్నేహితుల దినోత్సవంలో గాంధీ స్కూలు పూర్వ విద్యార్థులు

గాంధీ స్కూలు పూర్వ విద్యార్థుల కలయిక

ఏలూరు అర్బన్, ఆగస్టు 4: దశాబ్దాల క్రితం కలసి చదువుకున్న మిత్రులు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఆదివారం కలుసుకున్నారు. పలువురు వివిధ దేశాలు, రాష్ట్రాల్లో ఉన్నతాధికారులు, ఉద్యోగులుగా స్థిరపడ్డారు. మరికొందరు స్థానికంగా వ్యాపారం, వృత్తుల్లో కొనసాగుతున్నారు. తాము చదువుకున్న పాఠశాల ప్రాంగణంలో బాల్య జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుంటూ మళ్లీ పిల్లలై పోయారు. గంటలపాటు సరదాగా గడిపారు. రాష్ట్రంలోనే రెండో మున్సిపల్ ఎయిడెడ్ హైస్కూలుగా 1921లో జాతిపిత మహాత్మాగాంధీ ప్రారంభించిన ఏలూరు శ్రీ గాంధీ ఆంధ్ర జాతీయ మహావిద్యాలయం 1921-2024 పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 1952లో పదో తరగతి చదువుకున్న వారంతా అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. గురువులను సన్మానించారు. రక్తదాన శిబిరంలో 24మంది రక్తదానం చేశారు. పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, బూట్లను, డిక్షనరీలను పంపిణీ చేశారు. స్కూలు ప్రాంగణంలో మహాత్మాగాంధీ నాటిన చెట్టు ఎండిపోవడంతో ఆయన జ్ఞాపకాలకు కొనసాగింపుగా మరో మొక్కను అదే స్థానంలో నాటారు. బాటసారులకు మొక్కలను ఉచితంగా అందజేసారు. గురువులను వారి ఇళ్ల వద్దకే వెళ్ళి సత్కరించారు. వందమంది అనాథలకు మధ్యాహ్న భోజనం ప్యాకెట్లను అందజేసారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు భానుప్రకాష్, కొత్తపల్లి రాంబాబు, కలగర కిశోర్, షణ్ముఖం, కృష్ణ, మురళి, పిచ్చియ్య, సత్యనారాయణ, పతంజలి, కృష్ణమూర్తి, భాస్కర్, బ్రహ్మాయ్య, విజయలక్ష్మి, కృష్ణమోహన్, సురేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భీమడోలు హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

భీమడోలులో అపూర్వ సమ్మేళనం

భీమడోలు, జులై 4 : భీమడోలు హైస్కూలులో ఆదివారం 2000-2001 పదో తరగతి విద్యార్థుల స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హైస్కూలులో హాజరైన పాత విద్యార్థులంతా కేక్‌ను కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. పాత సంఘటనలు నెమరువేసుకున్నారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని ఆటపాటలతో సరదాగా గడిపారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం

కామవరపుకోట, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. స్నేహితులు ఒకరికొకరు కరచలనం చేసుకుని కేక్‌లు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికార, ఉద్యోగుల నివాసాల వద్ద స్నేహితుల వేడుకలు జరిపారు. పాతూరులో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఘంటా సత్యంబాబు, ఘంటా సుధీర్‌బాబు, కోనేరు వెంకట సుబ్బారావు, కోనేరు వెంకట్రామయ్య, జీలకర్రగూడెంలో జమిందారు చిన్నబాబు, గుంటుపల్లిలోని సర్పంచ్ గోరిక దాసు, కంఠమనేనివారిగూడెంలో చిన సత్యనారాయణ, అంజిమూర్తి, పుష్పరాజ్యం, కొల్లివారిగూడెంలో బేతిన వెంకట్రావు నివాసాల వద్ద స్నేహితుల దినోత్సవ కేక్ కట్ చేశారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

నిడమర్రు, ఆగస్టు 4: అంకితభావంతో పనిచేసి విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల సేవలు గుర్తుండిపోతాయని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. బావాయిపాలెం ఉన్నత పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయుడు వల్లా నరసింహమూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం సత్కరించారు. హెచ్‌ఎం కె.హరినాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం దుశ్శాలువ పూలమాలలతో నరసింహమూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. పాశం పాండురంగారావు, నరసింహమూర్తి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పుప్పాల ప్రకాశరావు, కె.మల్లేశ్వరరావు, నిమ్మల జయప్రకాష్ నారాయణ, కణితి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారపుపేట సచివాలయం వద్ద ఆదివారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎ.చందన దంత పరీక్షలు నిర్వహించి మందులు, పేస్ట్‌లు అందజేశారు. గూడవల్లి శ్రీనివాస్, లంకపల్లి మాణిక్యాలరావు, చేకూరి గణేష్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.
- **ఏలూరు టూటౌన్ :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఎస్‌వీఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు 105 మందికి ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.
- **పోలవరం :** పట్టిసీమ సత్యసాయి మంచినీటి పైపులైను మరమ్మతులు ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి కార్యదర్శి తాతి విజయకుమారి సత్యసాయి సిబ్బందితో సమస్య పరిష్కరించారు.
- **బుట్టాయగూడెం :** వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద గురైన బాధితులకు జనసేన నాయకులు ఆదివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు క్యాంపు కార్యాలయంలో 250 దోమతెరలను అందజేశారు. రవివర్మ, శివగంగాభవాని, ఫణి, రవీంద్ర, శ్రీకాంత్, శివాజీ పాల్గొన్నారు.
- గ్రేస్ గ్లోరీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కోయరాజమండ్రిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టరు రాజశేఖర్ పాల్గొని 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.
- **కొయ్యలగూడెం :** దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని జాతీయ దివ్యాంగుల హక్కుల జిల్లా కన్వీనర్ కే.జయరాజు కోరారు. అంత్యోదయ కార్డు ఇవ్వాలని, బ్యాక్‌లాగ్‌పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎస్.రాంబాబు, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** సొసైటీ కార్యాలయ గుమస్తా అనుమలంక సుబ్బారావు ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విధి నిర్వహణలో సొసైటీలో సిబ్బంది, రైతుల మన్ననలు పొందారు. ఆయన మృతి తీరనిలోటని కార్యాలయ సిబ్బంది బోడా ఆనంద్ తెలిపారు. డీసీసీబీ బ్రాంచి మేనేజరు సుధాకర్, గూడపాటి రాధాకృష్ణ, సిబ్బంది సుబ్బారావు మృతదేహానికి నివాళులర్పించారు.

జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సక్సెస్

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన దాతలు, ప్రభుత్వం



శస్త్రచికిత్స ముగిసిన తర్వాత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్యులు, జ్ఞానేశ్వరి (శస్త్ర చికిత్సకు ముందు)

ఏలూరు అర్బన్, ఆగస్టు 4 : కాలేయ మార్పిడి(లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్ర చికిత్సకు అవసరమైన ఆర్థిక స్థోమతలేక దాతల సాయం కోసం అర్థిస్తూ గత వారం రోజులుగా ఎదురు చూస్తున్న ఏలూరుకు చెందిన బాలిక కోటం జ్ఞానేశ్వరికి ఎట్టకేలకు ఆపరేషన్ పూర్తయింది. తమిళనాడు పెరుంబాక్కంలోని గ్లెనిగల్స్ హెల్త్‌సిటీ చెన్నై హాస్పిటల్‌లో చీఫ్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ నేతృత్వంలోని వైద్యుల బృందం జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్‌ను శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఆదివారం తెల్లవారు జాము 2.30 గంటల వరకు నిర్వహించిన ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్టు బాలిక కుటుంబ సభ్యులు తెలిపారు. బాలికకు వివిధ వైద్య పరీక్షలు,శస్త్ర చికిత్స, ఆపరేషన్ అనంతరం పర్యవేక్షణ కాలానికి రూ.40 లక్షలు అవసరమవుతాయని వైద్యులు అంచనావేయగా, అంత భారీ మొత్తంలో ఖర్చు భరించే స్థోమత జ్ఞానేశ్వరి తల్లిదండ్రులకు లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ దాతల సాయం కోసం 'ఆదుకోండి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 30న ఓ ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనం అదే రోజు నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయింది. పలు ప్రాంతాల నుంచి స్పందించిన దాతలు తమ విరాళాలను జ్ఞానేశ్వరి తల్లి దుర్గకు ఫోన్‌పే ద్వారా, బ్యాంకు చెక్కుల రూపంలో పంపించారు. మరోవైపు బాలిక ఆరోగ్యస్థితిని తెలుసుకున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి నేరుగానే జోక్యం చేసుకుని కుటుంబ సభ్యులను వెంటపెట్టుకుని సీఎం కార్యాలయానికి తీసుకెళ్ళి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపరేషన్‌కు అవసరమైన నిధులను విడుదల చేయాల్సిందిగా కోరారు. దీంతోపాటు మంత్రి లోకేష్ వ్యక్తిగత సహాయకుడు కూడా జ్ఞానేశ్వరి శస్త్ర చికిత్సకు ప్రభుత్వం నుంచి నిధులు అందజేస్తామని, ఆ మేరకు ఎల్‌వోసిని పంపిస్తామని ఆస్పత్రి యాజమాన్యానికి చెప్పారని వివరించారు. ఈ లోగా బాలిక ఆరోగ్యస్థితి క్షీణిస్తుండడంతో దాతలు అందించిన విరాళాల మొత్తం రూ.10.50 లక్షలను చెల్లించగా, మిగతా మొత్తానికి జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యుల నుంచి హామీ తీసుకుని శనివారం శస్త్ర చికిత్సను చేశారని వివరించారు. తల్లి దుర్గ కాలేయం మ్యాచ్ కావడంతో అందులో 40 శాతం భాగం సేకరించి, కుమార్తె జ్ఞానేశ్వరికి ఆపరేషన్ ద్వారా అమర్చారు. ఇలా తన లివర్‌లో కొంతభాగాన్ని కోల్పోయిన తల్లి దుర్గ కొంతకాలానికే మెడిసన్‌తో పూర్తిస్థాయిలో రీప్లేస్ అవుతుందని వైద్య నిపుణులు చెప్పారని తెలిపారు.

'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు

ఆపరేషన్ ఖర్చులు భరించే స్థోమతలేక తీవ్ర ఆందోళనలోవున్న జ్ఞానేశ్వరి దీనస్థితిని బయట ప్రపంచానికి తెలిసేలా ప్రత్యేక కథనంతో దాతలు పెద్ద సంఖ్యలో ముందుకువచ్చి ఎవరికితోచిన సాయంవారు అందించేలా కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి, అలాగే తమకు ఆర్థికంగా అండగా నిలిచిన ప్రతిఒక్కరికి బాలిక తల్లిదండ్రులు, కుటుంబీకులు, స్నేహితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మెసేజ్‌లకు స్పందించవద్దు



ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 4 : మీడియా మాధ్యమాల ద్వారా, ఫోన్‌కాల్స్ ద్వారా, మెస్సేజ్‌ల ద్వారా వచ్చే వాటికి స్పందించ వద్దని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ప్రజలకు సూచించారు. సైబర్ నేరగాళ్ళు లాటరీ తగిలిందనో, లక్కీడిప్ ద్వారా మీరు ఎంపికయ్యారనో లేదా మీకు కొరియర్ వచ్చిందనో రకరకాల ఫోన్‌కాల్స్ కాని, మెస్సేజ్‌లు కాని పంపిస్తున్నా రని చెప్పారు. ఇలాంటి వాటిని నమ్మి ఆశపడితే చివరకు మోసపోవడమే జరుగుతుందన్నారు. డబ్బులు ఊరికే రావని అదే విధంగా ఊరికే ఎవ్వరు ఇవ్వరని అనే విష యాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓటీపీ నెంబర్ కాని, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే స్పందించవద్దన్నారు. కొంతమంది వాట్సప్ కాల్స్ చేసి బెదిరిస్తు న్నారని తాము సీబీఐ అధికారులమనో, పోలీస్ అధికారు లమనో చెప్పి, కొరియర్‌లో డ్రగ్స్ బుక్ చేశారంటూ కేసు నమోదు చేశామని బెదిరిస్తారన్నారు. మరికొంత మంది ఫోన్లను హ్యాక్ చేయడానికి ఏపీకే ఫైల్స్‌ను పంపించి వాటి ని ఓపెన్ చేయగానే మన ఫోన్ డేటా సైబర్ నేరగాళ్ళ చేతిలోకి వెళ్ళిపోతోందన్నారు. హ్యాక్ చేసిన తరువాత మన ఫోన్ డేలాలో ఉన్న ఫోటోలను మార్ఫింగ్ చేసి వీడియోకాల్స్ ద్వారా చూపించి బెదిరిస్తారని ఇలాంటి వాటికి భయపడవద్దని వెంటనే జిల్లా పోలీస్ కార్యాలయ వాట్సప్ నెంబర్ 95503 51100కు మెస్సేజ్ రూపంలో తెలియజేయాలని ఎస్పీ కిశోర్ సూచించారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

నూజివీడు టౌన్, ఆగస్టు 4: ఉపాధి హామీ పథకంలో నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో 2023-24లో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని ఈ నెల 5 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏపీవో ఎస్.సోమేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఆలయ చెరువు లీజుకు వేలం

ముదినేపల్లి, ఆగస్టు 4: ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని శ్రీ సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయానికి చెందిన గుడివాడ రూరల్ మండలంలోని మోటూరు గ్రామ పరిధిలోగల 111 ఎకరాల చేపల చెరువును లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 5న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. చెరువులో చేపలు పెంచుకోవటానికి మూడేళ్ల కాలపరిమితికి లీజుకు ఇవ్వనున్నట్లు, వేలాన్ని మోటూరు గ్రామ సచివాలయం వద్ద నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

8న కొబ్బరి చెక్కలు, దుకాణం అద్దెకు వేలం..

సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఏడాది కాల పరిమితికి కొబ్బరి చెక్కలు పోగు చేసుకొనే లైసెన్స్ పొందేందుకు, ఒక షాపు అద్దెకు ఈ నెల 8న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సంధ్య తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి



ముదినేపల్లి, ఆగస్టు 4: నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల నియామకంలో బీజేపీకి తగు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం ముదినేపల్లిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవస్థానాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలకు అభ్యర్థుల ఎంపికలో బీజేపీ కోసం ఏళ్ల తరబడి పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు కూడా స్థానం కల్పించాలని తీర్మానించారు. ముదినేపల్లి, మండలాల బీజేపీ అధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మి, సమయం యేసుబాబు, అసెంబ్లీ నియోజకవర్గ కో-కన్వీనర్ అడుసుమిల్లి సాయి కృష్ణ, నాయకులు వత్తుమిల్లి ప్రసాద్, పసుపులేటి నరసింహారావు, రెడ్డి రాధిక పాల్గొన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావుతోపాటు కృష్ణారావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వడాలిలో సమావేశమై నామినేటెడ్ పదవుల నియామకంలో పార్టీకి ప్రాధాన్యత కల్పించే విషయంపై చర్చించారు. బీజేపీ తీర్మానాన్ని అందజేశారు.

రసాయన రహిత వ్యవసాయం మేలు

ముదినేపల్లి, ఆగస్టు 4 : రైతులు రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగా హన పెంచు కోవాలని వ్యవ సాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగ ముదినేపల్లి మండల ఇన్‌చార్జ్ గౌతమ్ కుమార్ తెలిపారు. సింగరాయపాలెంలో ఆదివారం ప్రత్యేకంగా గ్రోత్ ప్రమోట్ కార్యక్రమం నిర్వహించారు. చేప బెల్లం ద్రావణాన్ని తయారు చేసి వరి సాగుకు వినియోగించే విధానాన్ని రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను సాధించవచ్చునని ఆయన తెలిపారు. సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.



మంకొల్లు–చీపురుగూడెం రహదారిలో భారీ గొయ్యి



చిన్నంపేట ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి

బాబోయ్ గోతులు!

భారీ గోతులతో ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు

వర్షాలతో మరింత పెద్దవై ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన

అధికారులు తక్షణం మరమ్మతులు చేయించాలని ప్రజల వినతి

చాట్రాయి, ఆగస్టు 4: మండలంలో మంకొల్లు- చీపురుగూడెం రహదారిలో, చిన్నంపేట గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గోతులు వాహన చోదకులను భయపెడుతున్నాయి. ద్విచక్రవాహన చోదకులు ఈ గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. వర్షాలకు ముందు చిన్నగా ఉన్న ఈ గోతులు వాహనాల తాకిడికి పెద్దవవుతున్నాయి. చిన్న వర్షం కురిసినా ఈ గోతులు చెరువులను తలపిస్తున్నాయి. రహదారిపై గోతుల్లో నిండుగా నీరు ఉండటంతో వాహన చోదకులు అదుపు తప్పి పడిపోయి గాయపడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తక్షణం రహదారి మరమ్మతులు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

సొంత పార్టీవారే అన్యాయం చేశారు..?



విలేకరులతో మాట్లాడుతున్న కవిత, ఏసుబత్తుడు

ముసునూరు, ఆగస్టు 4: వివాదం పరిష్కరించడంలో వైసీపీ నాయకులు ఏకపక్షంగా వ్యవహరించారంటూ కాట్రేనిపాడు వైసీపీకి చెందిన దంతమాల కవిత అనే మహిళ ఆరోపించింది. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తనకు తమ పార్టీకే చెందిన అమర్తల శ్రీనివాసరావుకు రెండు నెలల క్రితం ఇంటి దారిలో పైప్‌లైన్ వేసే విషయమై వివాదం జరిగిందన్నారు. శ్రీనివాసరావు తనపై దాడికి ప్రయత్నించగా, తాను అడ్డుకునే క్రమంలో శ్రీనివాసరావు తలకు స్వల్ప గాయం అయిందని ఈ వివాదంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పింది. అయితే ఈ వివాదాన్ని పరిష్కరిస్తామని గ్రామ పార్టీ నాయకులు తనతో ఫిర్యాదును వాపస్ చేయించారని అయితే సమస్య పరిష్కరించలేదని తెలిపింది. శ్రీనివాసరావుపై తాను దాడి చేసినట్లు, తాను టీడీపీ వ్యక్తినని ఆరోపించి, నూజివీడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా శనివారం శ్రీనివాసరావుకు రూ.50 వేలు చెక్కును ఇవ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. దశాబ్ద కాలంగా వైసీపీలో ఉన్న తమ కుటుంబానికి నాయకులు తీవ్ర అన్యాయం చేశారని త్వరలో టీడీపీలో చేరనున్నట్లు ఆమె స్పష్టం చేసింది. మరో బాధితుడు కోనా ఏసుబత్తుడు మాట్లాడుతూ తనకు, అమర్తల శ్రీనివాసరావుకు ఉన్న సరిహద్దు వివాదం, భూమి కొనుగోలు వివాదంలో వైసీపీ నాయకులు శ్రీనివాసరావుకు కొమ్ముకాసి, తనకు అన్యాయం చేశారని ఆరోపించాడు. తన కుటుంబం త్వరలో టీడీపీలో చేరుతామని తెలిపాడు.

సంపాదనలో కొంత సేవలకు వెచ్చించాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఆగస్టు 4: ప్రతి మనిషి తన సంపాదనలో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే మానవ జన్మకు సార్థకత ఏర్పడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం లోకుమూడి దత్తాశ్రమం లో ఉచిత వైద్య శిబిరాన్ని దత్తాశ్రమం, వాకర్స క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ సేవ చేసేవారిని ఎప్పుడూ ప్రోత్సహించాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 190 మందికి గుండెకు, 194 మందికి కంటి చికిత్సలను నిర్వహించి ఉచితంగా మందులను ఎన్టీఆర్ మెమో రియల్ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, దత్తాశ్రమం ట్రస్టీ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ లోయ ఈశ్వరరాజు, సీనియర్ న్యాయవాది గొర్తి ప్రభాకర దీక్షితులు, టాప్ స్టార్ హాస్పిటల్ వైద్యులు, అర్చన, అపూర్వ, అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



47వ రోజు అన్న క్యాంటీన్

కైకలూరు ఆగష్టు 4: ప్రతి రోజు అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం కైకలూరులో 47వ రోజు అన్నక్యాంటీన్‌ను టీడీపీ నాయకుడు పొత్తూరి వాసురాజు ఆర్థిక సాయంతో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రతి రోజు దాతల సహకారంతో నిర్వరామంగా ప్రజలకు భోజనాన్ని అందిస్తున్నామన్నారు. టీడీపీ నేతలు పూల రామచంద్రరావు, ఎంఎ రహీం, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రోటరీ అధ్యక్షుడు నరేంద్ర కుమార్

300 మొక్కలు నాటిన రోటరీ

నూజివీడు టౌన్, ఆగస్టు 4: పర్యావరణ పరిరక్షణకు రోటరీ క్లబ్ తన వంతు బాధ్యత నిర్వహిస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ అధ్యక్షుడు దోనెపూడి నరేంద్రకుమార్ అన్నారు. నూజివీడు సరస్వతీదేవి ఆలయ సమీపంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 300 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా దోనెపూడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించేందుకు ముందుకు రావాలన్నారు. రోటరీ క్లబ్ కార్యదర్శి కె.సత్యనారాయణ, సీనియర్ సభ్యులు యార్లగడ్డ రాజగోపాల్, అనిల్‌కుమార్, గొల్లపూడి రవిబాబు, మద్రిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ప్ల కార్డులతో రైతుల నిరసన

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌పై పోలీసులకు ఫిర్యాదు

నూజివీడు, ఆగస్టు 4: 1983లో భూమి కొనుగోలు చేసి 2020 వరకు సాగులో ఉన్న 9 మంది రైతులకు చెందిన 29.50 ఎకరాల భూమిని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికారులపై ఒత్తిడి తెచ్చి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్పు చేయించారని ఆరోపిస్తూ మేకా ప్రతాప్ అప్పారావుపైన, నాటి ఆర్డీవో, తహసీల్దార్‌పై ఆదివారం పోలీసులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. నూజివీడు పట్టణ పరిధిలో సర్వే నెం.127-2లోని 29.50 ఎకరాల భూమిని 9 మంది రైతులు 1983లో కొనుగోలు చేసి 1985లో సదరు భూమిని రిజిస్టర్ కూడా చేయించుకున్నామని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు కొనుగోలు చేసిన భూమి మేకా ప్రతాప్ అప్పారావు సమీప బంధువులదన్నారు. తాము ఇనుగంటి నరసింహారావు నుంచి ఈ భూమిని కొనుగోలు చేశామన్నారు. నరసింహారావు సోదరి కాకుమాను స్రవంతిదేవి తనకు ఈ భూమి 2014లో తన అన్నగారి నుంచి వీలునామా ద్వారా సంక్రమించిందని పేర్కొంటూ 2017లో నూజివీడు రెవెన్యూ అధికారులకు రాతపూర్వక ఫిర్యాదుచేసి తన భూమి తనకు అప్పగించవలసిందిగా కోరారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతాప్ అప్పారావు తన సమీప బంధువు అయిన కాకుమాను స్రవంతిదేవికి మద్దతుగా అధికారులపై ఒత్తిడి తెచ్చి రెవిన్యూ రికార్డుల్లో తమ పేర్లు తొలగించి తన బంధువు పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారని బాధిత రైతు చిన్నం లక్ష్మీనరసింహారావు ఆరోపించాడు. తమకు జరిగిన అన్యాయంపై దర్యాప్తు జరిపి, తమకు న్యాయం చేయాలని కోరుతూ చిన్నం లక్ష్మీనరసింహారావు తదితర రైతులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులను సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని పట్టణ ఎస్సై రామకృష్ణ తెలిపారని రైతులు అన్నారు. ఫిర్యాదు అనంతరం వీరు కొద్దిసేపు పోలీస్‌స్టేషన్ ఎదుట ప్ల కార్డులతో నిరసన తెలిపారు.



నూజివీడులో నిర్వహిస్తున్న అహింసా ర్యాలీ

జీవ హింస విడనాడాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 4: జీవ హింసను విడనాడి శాకాహారానికి ప్రాధాన్యమివ్వాలని కోరుతూ మానవత ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో అహింసా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో అహింసా మార్గంలో నడవాలని, ధ్యాన శక్తి అద్భుత శక్తి అని పిరమిడ్ ధ్యాన కేంద్రం నినాదాలు చేసింది. జి.నాగరాజు, గరికపాటి సుబ్రహ్మణ్యం, రమణ, సుబ్బారావు, రాజు, శేషయ్య మాస్టర్‌లు పాల్గొన్నారు.



చంద్రబాబు వల్లే వర్గీకరణ స్వప్నం సాకారం

ముసునూరు, ఆగస్టు 4: సీఎం చంద్రబాబు దయ వల్లే ఎస్సీ వర్గీక రణ స్వప్నం నేరవేరిందని ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దల మోహన్‌రావు, బడిపాటి సాంబయ్య, సొంగా ఇసాక్‌లు అన్నారు. ఆదివారం కాట్రేనిపాడులో సమితి అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి స్థానిక సమితి నాయకులు పాలాభిషేకం చేసి, విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనాడు సీఎంగా ఉన్న చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకురావడం వల్ల వేలాదిమంది మాదిగలకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఆయన చొరవ వల్లే నేడు 30 ఏళ్ళ పోరాటానికి ఫలితం లభించిందన్నారు. సమితి నాయకులు గద్దల పుల్లయ్య, కంబాల నాగరాజు, గద్దల నిరంజన్ పలువురు యువకులు పాల్గొన్నారు.

సకల శుభాల శ్రావణం

» నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం

ద్వారకాతిరుమల, ఆగస్టు 4: శ్రవణా నక్షత్ర ప్రవేశమే...శ్రావణమాసం. హిందువులకు అత్యంత పవిత్రమైన మాసం ఇది. నిత్యం ఆధ్యాత్మిక, ధార్మిక పరిమళాలతో భక్తకోటి పునీతమయ్యే పరమపవిత్ర మాసం ఈ శ్రావణం. నెలరోజుల పాటు భగవన్నామ స్మరణలతో తెలుగు లోగిళ్ల మార్మోగ నున్నాయి. నోములు, వ్రతాలు, పూజలు, ఉపవాసాలతో మహిళలు బిజీగా ఉండే శ్రావణమాసం ఈ రోజు నుంచే ప్రారంభమైంది. ఉత్తరాది వారికి సూర్య మాన క్యాలెండర్ ప్రకారం జూలై 22 నుంచే శ్రావణమాసం ప్రారంభమైంది. అయితే మనం అనుసరించే చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం ఆగస్టు 5 నుంచి శ్రావణం ప్రారంభమవుతుంది. ఆలయాలకు భక్తుల రాకను పురస్కరించుకుని క్షేత్ర దేవతగా కొలువుదీరిన కుంకుళ్లమ్మ ఆలయం ముస్తాబవుతోంది. ఆషాఢం వెళ్లిన తర్వాత శ్రావణమాసంలో కొత్తల్లుళ్లు అత్తారిళ్లకు వెళ్లడం ఇక్కడి ఆచారం. శ్రావణమాసంలో 16న వచ్చే రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

ఆధ్యాత్మిక సంతృప్తి ఇచ్చేది శ్రావణమే

అన్నివిధాల శ్రేష్ఠమైనది ఈ శ్రావణ మాసం. వివాహాది శుభకార్యాలు జరుగడంతో పాటు అన్ని రోజులూ దైవపూజకు, వ్రతాలకు అనుకూలమైనవే. అమ్మవార్ల ఆలయాల్లో జరిగే విశేషపూజల్లో పాల్గొంటే శుభం కలుగుతుంది.

- గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ, వ్రత పురోహితులు, ద్వారకాతిరుమల

పనిచేయని ఏటీఎంపై ఉన్నతాధికారులు ఆరా

చాట్రాయి, ఆగస్టు 4: చాట్రాయిలో ఎస్బీఐ ఏటీఎం నెల రోజులుగా పనిచేయకపోవటంపై బ్యాంకు ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. నెల రోజులుగా పనిచేయని ఏటీఎం శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి ఎస్బీఐ ఉన్నతాధికారులు స్పందించి, చాట్రాయి బ్యాంకు అధికారులను వివరణ అడిగినట్లు తెలిసింది. త్వరలోనే ఏటీఎంకు అవసరమైన మరమ్మతులు జరిపించి, పని చేయించే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్